బమ్మెర పోతనామాత్య కృత

# నారాయణ శతకము

## భోగనీ దండకము



telugubhagavatam.org

# నారాయణ శతకము

[లఘుటీకతో]

# భోగినీ దండకము

## బమ్మెర పోతనామాత్యులు

సంకలనం

**భాగవత గణనాధ్యాయి**

లఘుటీక

**కంది శంకరయ్య**

'శంకరాభరణం' ప్రచురణలు



**శంకరాభరణం**

శరణం పండిత మానసాపహరణం, శశ్వద్యశఃకారణం, సరసానందద వాగ్విలాస చరణం, శబ్దార్థ సంపూరణమ్।
చరదత్యద్భుత సత్కవీశ్వరగణం, సాలంబనం 'శంకరాభరణం', నిత్యమహం స్మరామి విలసద్ వాగ్దివ్యసింహాసనమ్।

# నారాయణ శతకము (లఘుటీకతో)
# భోగినీ దండకము

**మూలం : బమ్మెర పోతన**

**సంకలన కర్త : వూలపల్లి సాంబశివ రావు**
Vsrao50@gmail.com

**లఘుటీక : కంది శంకరయ్య**

'శంకరాభరణం' ప్రచురణలు : 24
ప్రచురణ: జులై 2020
ప్రతులు : 500

వెల: ₹ 50

ప్రతులకు సంప్రదించండి :
ఊలపల్లి సాంబశివరావు (9959613690)
కంది శంకరయ్య (7569822984)

డి.టి.పి. : కంది శంకరయ్య

# పీఠిక

నరస్య ఇదం నారమ్. అవతారేషు నారం వపురయత ఇతి. నర సంబంధమైన శరీరము నారము. అవతారములయందు నర శరీరమును పొందువాఁడు నారాయణుడు.

అయ గతౌ. నారా ఆపః. అయనం స్థానం యస్య సః నారమ్. అనగా జలము. అది స్థానముగా కలవాఁడు నారాయణుడు.

నర సమూహో నారం తస్య అయనమితి వా. తదయనమస్యేతి వా. నర సమూహమునకు స్థానమయిన వాఁడు. లేక నర సమూహము నివాసముగా కలవాఁడు నారాయణుడు.

రాః శబ్దాః ఆయంతే నిర్గచ్ఛంతే, యస్మాత్ స రాయణః రాయణాదన్యః అరాయణః. అరాయణో న భవతి ఇతి నారాయణః. శబ్ద గమ్య ఇత్యర్థః. ఎవని వలన శబ్దములు బయలువెడలుచున్నవో అతఁడు రాయణుఁడు. రాయణుఁడు కాని వాఁడు అరాయణుఁడు. అరాయణుఁడు కానివాఁడు నారాయణుఁడు. అనగా శబ్దగమ్యుఁడు అని అర్థము. (రై శబ్దే) ఇంతటి విపులార్థయుక్తమయిన నారాయణ నామము సమస్తసృష్టికి మూలము.

అట్టి మూల పురుషుఁడయిన నారాయణుని పరిపూర్ణముగా గోచరింప చేయునది భాగవతము. అది సంస్కృతమున వ్యాస భగవానుఁడు వ్రాయగా, పోతన మహాకవి నభూతో నభవిష్యతి అనే విధముగా నిరుపమానముగా ఆంధ్రీకరించెను. సహజపాండిత్యుఁడు భక్తకవి బమ్మెర పోతన గంటం తాళపత్రాల క్షేత్రంలో పండించిన రత్నాల పంట తెలుఁగు భాగవతము. ఈ భాగవత ఆంధ్రీకరణకు ముందే తాను శ్రీమన్నారాయణుని అనుగ్రహము బడయఁ గోరి ఈ నారాయణ శతకమును రచించి యుండును. ఈ రచనను తాను చేయుటకు గల కారణమును

నే నీ దాసుఁడ నీవు నా పతివి నిన్నే కాని యొండెవ్వరిన్
ధ్యానింపం బ్రణుతింప నట్లగుటకున్నానేర్చు చందంబునన్
నీనామస్తుతు లాచరించు నెడలన్నేతప్పులుం గల్గినన్
వానిం లోఁగొనుమయ్య తండ్రి! విహితవ్యాపార నారాయణా!

అని 3 వ పద్యమున వివరించిరి మహాకవి పోతన.

11వ పద్యం నుండి 20వ పద్యం వరకు మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, రామ, బలరామ, బుద్ధ, కల్కి అవతారాలను అత్యద్భుతంగా వర్ణించుట ద్వారా తాను ఆంధ్రీకరించబోవు భాగవతమునకు కథాసూచన యగు నాందిగా ఈ శతకము వ్రాసినట్లు మనము ఊహింపఁగలము.

104వ పద్యమున

రమణీయంబుగ నాదిమంబు నవతారంబున్ భవద్దివ్యరూ
పము నామామృతమున్ దలంప దశకప్రాప్తయ్యెఁ గృష్ణావతా
రము సుజ్ఞానము మోక్షమున్ ద్వివిధ సంప్రాప్తిన్ శతాంధ్రాఖ్యకా
వ్యము నర్పించితి మీ పదాబ్జములకున్ వైకుంఠ నారాయణా!

అని తన శతక రచనకు సంబంధించిన చక్కని ప్రణాళికను తానేర్పరచుకొన్నది చక్కగా వివరించి ఆ స్వామికి విన్నవించుకొన్నాడు పోతనమహాకవి.

అవతార దశకంతో మొదలుపెట్టి, దివ్యరూప దశకం, నామ ప్రభావ దశకం అనే నాలుగు విషయాలు పదేసి పద్యాలతో అందంగా సమకూర్చి, తరువాత కృష్ణావతార వింశతి (20), జ్ఞానవింశతి (20), మోక్షవింశతి (20) అనే మూడు విషయాలతో కూడి ఈ శతకం సుసంపన్నమయింది.

తాను రచింపఁ బోవు భాగవత కథాసూచి చేయుట, తన శతకమును ఒక అర్థవంతమైన ప్రణాళికతో నిర్మించుట, అంతే కాక కావ్యమునకు పరమప్రయోజనమైన ఉపదేశమును చేయుట మున్నగు సల్లక్షణ సమన్వితముగా ఈ నారాయణ శతకమును లోకమునకందించుట మూలమున భక్త పాఠకులకు మోక్షమహత్ఫలాన్ని సంప్రాప్తింప చేయాలనే పోతనగారి ప్రయత్నము సఫలమైనది. వీరు కృతకృత్యులైనారు.

ఇట్టి నారాయణ శతకాన్ని జాలతెలుగులకు భావార్థ సహితంగా అందిస్తున్నవారు ఒకరు శ్రీ ఊలపల్లి సాంబశివ రావుగారు పోతన తెలుగు భాగవతాన్ని జాలతెలుగులకు జేర్చే తెలుగుభాగవతం.ఆర్గ్ వ్యవస్థాపక అధ్యక్షులు. మరొకరు శ్రీ కంది శంకరయ్యగారు ఆంధ్రులపాలిటి పద్యాల ఆభరణం అయిన శంకరాభరణం బ్లాగు వ్యవస్థాపక అధ్యక్షులు. వీరి అవిరళ కృషి ఫలాన్ని అందుకోండి ఆస్వాదించండి. ఆ శ్రీమన్నారాయణ సత్యపామృతాన్ని భక్త పాఠకులు చక్కగా చూరగొనగలరని విశ్వసించుచున్నాను.

పాఠకులకందించే చక్కని ప్రయత్నమును చేసిన శ్రీ ఊలపల్లిసాంబశివరావు గారిని, శ్రీ కంది శంకరయ్య గారిని మనసారా అభినందించుచు ఆ శ్రీమన్నారాయణుని కృప వీరికెల్లవేళల లభించవలెనని కోరుకొనుచున్నాను. స్వస్తి!

భక్తజన విధేయుఁడు,

**చింతా రామకృష్ణారావు**

మియాపూర్, హైదరాబాదు

# విన్నపం

తెలుగువారికి భాగవతం అనగానే బమ్మెర పోతన, బమ్మెర పోతన అనగానే భాగవతం గుర్తుకు వస్తాయి. భాగవత రచనకు ముందు పోతన వీరభద్ర విజయం, భోగినీ దండకం, నారాయణ శతకం రచించాడు.

నారాయణ శతకంలోని పద్యాలు పోతన కవితా ప్రారంభ స్థాయిని తెలియజేస్తాయి. భాగవత పద్యాలలోని మాధుర్యం, ధార, అలంకార శోభ ఈ శతకంలో లేకున్నా దీనిని ప్రణాళికా బద్ధంగా రచించాడు. ఆ విషయాన్ని తానే స్వయంగా 104వ పద్యంలో ప్రకటించాడు.

'భాగవత గణనాధ్యాయి' శ్రీ ఊలపల్లి సాంబశివరావు గారు తెలుగు భాగవతం వెబ్‌సైటులో సంపూర్ణ భాగవతాన్ని అర్థ తాత్పర్యాలతో ప్రకటించడమే కాక పోతన ఇతర రచనలు, పోతనపై ఇతరుల రచనలను ప్రకటించారు.

ఆ కార్యక్రమంలో భాగంగా నారాయణ శతకాన్ని సటీకా తాత్పర్యాలతో తమ వెబ్‌సైటులో ప్రకటించారు. మిత్రుల కోరిక మేరకు దీనిని ఇప్పుడు ముద్రిస్తున్నారు.

ఈ నారాయణ శతకానికి అర్థ తాత్పర్యాలు వ్రాసే అవకాశం నాకు లభించడం నా అదృష్టం. శ్రీమాన్ కె.వి. రాఘవాచార్యుల 'రాఘవీయ వ్యాఖ్యానము' నాకెంతగానో ఉపకరించింది. అందుకు వారికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

ఎందరో మిత్రులు 'భోగినీ దండకము'ను గురించి వినడమే కాని పుస్తకం లభ్యం కాలేదన్నారు. అందువల్ల అనుబంధంగా దానికి కూడ చేర్చాము.

బుధజన విధేయుడు

**కంది శంకరయ్య**

'శంకరాభరణం' బ్లాగు, వాట్సప్ సమూహ నిర్వాహకుడు

# నారాయణ శతకము

**శ్రీరామామణి పాణిపంకజ మృదుశ్రీతజ్ఞపాదాబ్జ! శృం**
**గారాకారశరీర! చారుకరుణాగంభీర! సద్భక్తమం**
**దారాంభోరుహపత్రలోచన! కళాధారోరు సంపత్సుధా**
**పారావారవిహార! నా దురితముల్ భంజింపు, నారాయణా! 1**

**లఘు టీకా :** శ్రీరామామణి = లక్ష్మి అనబడే స్త్రీరత్నం యొక్క; పాణి = చేతులు అనెడి; పంకజ = తామరపువ్వుల యొక్క; మృదుశ్రీ = మృదుత్వం యొక్క శోభను; తజ్ఞ = తెలుసుకున్న; పాద+అబ్జ = పాద పద్మములు కలవాడా! శృంగార + ఆకార = శృంగారం మూర్తీభవించినట్టి; శరీర = దేహం కలవాడా; చారు = అందమైన; కరుణా = దయాగుణంతో; గంభీర = గాంభీర్యం కలవాడా; సత్+భక్త = మంచి భక్తుల పాలిటి; మందార =కల్పవృక్షమా; అంభోరుహ = నీట పుట్టిన పద్మము యొక్క; పత్ర = రేకులవంటి; లోచన = కన్నులు గలవాడా; కళా +ఆధార = సమస్త కళలకు ఆధారమైన; సంపత్ + సుధా = సంపదలతో అమృతమయంగా ఉన్న; పారావార = సముద్రంలో; విహార = విహరించేవాడా! నా దురితముల్ = నా పాపములను; భంజింపు = నాశనం చెయ్యి; నారాయణా = విష్ణుదేవా! (నారములు అంటే జలం. 'నారములు స్థానంగా కలవాడు నారాయణుడు' అని మనుస్మృతి. 'నరునిచే కలిగిన తత్త్వాలు నారములు. అవి స్థానంగా కలవాడు నారాయణుడు' అని మహాభారతం. నారములు అంటే నాశనం లేని నిత్యవస్తువులు అని అర్థం. అటువంటి నారములకు ఆశ్రయమైనవాడు నారాయణుడు. 'ఎవనికంటే సూక్ష్మవస్తువు కాని, గొప్ప వస్తువు కాని లేవో అతడు నారాయణుడు' అని వేదవాణి).

**భావం :** నారాయణా! లక్ష్మీదేవి అనే స్త్రీరత్నం యొక్క తామరపువ్వుల వంటి చేతుల మృదుత్వశోభను తెలుసుకున్న పాదపద్మాలు కలవాడవు. శృంగారం మూర్తీభవించిన శరీరం నీది. అందమైన గంభీరమైన దయాగుణం కలవాడవు. సద్భక్తుల కోరికలు తీర్చే మందారవృక్షానివి నీవు. తామర రేకుల వంటి అందమైన కన్నులు కలవాడవు. సమస్త కళలకు ఆధారమైన గొప్ప సంపదలతో అమృతమయమైన సముద్రంలో విహరించేవాడవు. నా పాపాలను నాశనం చెయ్యి.

**మ. కడకుం బాయక వెయ్యినోళ్ళు గల యాకాకోదరాధీశుఁడున్**
**గడముట్ట న్వినుతింపలేక నిగుడన్ గ్రాలంగ నొప్పారు మి**
**మ్మడరన్ సన్నుతిసేయ నాదువశమే ? యజ్ఞాని లోభాత్ముడన్**
**జడుఁడ న్నజ్ఞుడ నైకజిహ్వుఁడ జనస్తబ్ధుండ, నారాయణా!** 2

**లఘు టీకా :** కడకున్+పాయక = చివరివరకు వదలకుండా; కాకోదర+ అధీశుడు = పాములకు ప్రభువైన ఆదిశేషుడు; కడముట్టన్ = పూర్తిగా; నిగుడన్ = సంభ్రమించగా; అ + ఏకజిహ్వుడ = ఒక్క నాలుక లేనివాడను (వదరుబోతును); జనస్తబ్దుడన్ = పుట్టుకతోనే సోమరిని.

**భావం :** నారాయణా! నిన్ను సంపూర్ణంగా పొగడలేక వేయి నోళ్ళున్న ఆదిశేషుడే సంభ్రమంలో పడ్డాడు. అటువంటిది అజ్ఞానం, స్వార్థబుద్ధి, మూర్ఖత్వం, వదరుబోతుతనం కలిగి పుట్టుకతోనే సోమరినైన నాకు నిన్ను స్తుతించడం సాధ్యమా?

**శా. నీనామస్తుతు లాచరించు నెడలన్నేతప్పులుం గల్గినన్**
**వానిం లోఁగొనుమయ్య తండ్రి! విహితవ్యాపార నారాయణా!**
**నే నీదాసుఁడ నీవు నాపతివి నిన్నే కాని యొండెవ్వరిన్**
**ధ్యానింపం బ్రణుతింప నట్లగుటకున్నానేర్చు చందంబునన్** 3

**లఘు టీకా :** ఎడలన్ = సమయాలలో; విహిత వ్యాపార = విశేషంగా మేలు కలిగించే కార్యాలను నిర్వహించేవాడా!

**భావం :** తండ్రీ! లోకాలకు విశేష హితాన్ని కలిగించే కార్యాలను నిర్వహించే నారాయణా! నేను నీ సేవకుడను. నీవు నా యజమానివి. నిన్ను తప్ప అన్య లెవ్వరినీ తలచుకొనను, పొగడను. అందువల్ల నాకు తెలిసిన పద్ధతిలో నీ గుణాలను తెలిపే పేర్లను ప్రశంసించే సమయంలో తప్పు లేమైనా దొర్లితే క్షమించి స్వీకరించు.

**మ. నెరయన్ నిర్మల మైన నీస్తుతి కథానీకంబు పద్యంబులో**
**నొరుగుల్ మిక్కిలి గల్గె నేనియుఁ గడున్ యోగంబె చర్చింపఁగాఁ**
**గుఱుగన్వైనను వంకబోయినఁ గడుం గుజ్జైనఁ బేడెత్తినం**
**జెఱుకుం గోలకు తీపు గాక కలదే చే దెందు నారాయణా!** 4

**లఘు టీకా :** నెరయన్ = నిండుగా, పూర్తిగా; కథా+అనీకంబు = కథల సమూహం; ఒరుగుల్ = వంకలు; యోగంబె = యుక్తమే; కుఱు+కణ్పు = చిన్న కణుపు; వంక = వంకర; గుజ్జు = పొట్టి; పేడు+ఎత్తినన్ = పైతోడ్క పెరిగి పెద్దదైనచో; కోల = గడ; తీపు = తియ్యదనం.

**భావం :** నారాయణా! పూర్తిగా పవిత్రమైన నీ కథలు కలిగిన కవిత్వంలో తప్పులెన్ని ఉన్నా అది మిక్కిలి యోగ్యమైనదే. ఎందుకంటే చిన్న కణుపులున్నా, వంగిపోయినా, పొట్టిగా ఉన్నా, పైన పేడు పెరిగినా, చెరుకుగడ తియ్యగా కాక చేదుగా ఉంటుందా?

**మ. చదువుల్ పెక్కులు సంగ్రహించి పిదపం జాలంగ సుజ్ఞానియై**
**మదిలోఁ బాయక నిన్ను నిల్పఁదగు నామర్మంబు వీక్షింపఁడే**
**మొదలం గాడిద చారుగంధవితతుల్ మోవంగ శక్యంబె కా**
**కది సౌరభ్యపరీక్ష జూడ కుశలే యవ్యక్త నారాయణా!** 5

**లఘు టీకా :** సంగ్రహించి = సంపాదించి (నేర్చి); మర్మంబు = రహస్యం; గంధ వితతుల్ = పరిమళాల సమూహాలు; మోవంగ = మోయగా; సౌరభ్య పరీక్ష = సువాసనను పసిగట్టు పరీక్ష; కుశల+ఏ = చాతుర్యం కలదా? అవ్యక్త = ఇంద్రియగోచరం కానివాడా!

**భావం :** ఇంద్రియాలకు గోచరం కాని నారాయణా! మానవుడు ఎన్నో చదువులు నేర్చి తగినంత సమ్యక్ జ్ఞానం కలవాడై కూడా నిన్ను మనస్సులో సర్వదా స్మరిస్తూ నిల్పుకొనే రహస్యాన్ని కనుగొనడు కదా! గాడిద గంధపు చెక్కల నెన్నింటినో మోయగలదు కాని వాటి పరిమళాన్ని పసికట్టే నేర్పు దానికి ఉంటుందా?

**మ. లలిఁ గబ్బంబు కరాట మివ్వసుధ నెల్లన్ మించెఁ బో నీకథా**
**వలి కర్పూరము నించినన్ నితరమౌ వ్యర్థార్థకామోదముల్**
**పెలుచం బూనిన యక్కరాటము తుదిన్ బేతే కరాటంబె పో**
**చలదిందీవరపత్రలోచన! ఘనశ్యామాంగ నారాయణా!** 6

**లఘు టీకా :** లలిన్ = క్రమంగా; కరాటము = బరిణ; ఆమోదముల్ = పరిమళములు; పెలుచన్ = అతిశయంగా; బేతే = వ్యర్థంగా; చలత్ +

ఇందీవర పత్ర లోచన = చలించే నల్లకలువ రేకుల వంటి కన్నులు కలవాడా; ఘనశ్యామ + అంగ = మేఘం వంటి నల్లని శరీరం కలవాడా!

**భావం :** చలించే నల్లకలువ రేకులవంటి కన్నులు, మేఘంవంటి నల్లని శరీరం కలిగిన నారాయణా! కావ్యం ఒక బరణి వంటిది. దానిని నీ కథల సమూహం అనే పచ్చకర్పూరంతో నింపితే దాని పరిమళాలు లోకంలో విస్తరించి శాశ్వతంగా నిలుస్తుంది. అలా కాకుండా దానిని వ్యర్థ ప్రయోజనా లనబడే వాసనలతో నింపితే చివరికి అది కేవలం చేతిలో పట్టుకొనే వస్తువే అవుతుంది.

**మ. మనమార న్నచలేంద్రజాధిపతికిన్ మస్తాగ్రమాణిక్యమై**
**మునికోపానలదగ్ధ రాజతతికి న్ముక్తిస్ఫురన్మార్గమై**
**యెనయున్ సాయకశాయికిం జననియై యేపారు మిన్నేటికిం**
**జని మూలంబగు నంఘ్రి మాదు మదిలోఁ జర్చింతు నారాయణా! 7**

**లఘు టీకా :** మనము+ఆరన్ = మనసారా; అచల+ఇంద్రజ+అధిపతికిన్ = పర్వతరాజ పుత్రిక యైన పార్వతి యొక్క భర్త అయిన శివునకు; మస్త+అగ్ర = జటాజూటమందు; స్ఫురత్+మార్గము+ఐ = ప్రకాశించే (ముక్తికి) దారియై; ఎనయన్ = పొందికగా; సాయకశాయికిన్ = అంపశయ్యపై పడుకొన్న భీష్మునకు; ఏపారు = శోభించే; మిన్నేటికిన్ = ఆకాశగంగకు; జనిమూలంబు = జన్మస్థానం; అంఘ్రి = పాదము; చర్చింతు = ధ్యానం చేస్తాను.

**భావం :** నారాయణా! శివుని జటాజూటానికి అలంకారమై, కపిలముని కోపాగ్నికి కాలి బూడిద అయిన సగరుని కుమారులైన రాజసమూహానికి ముక్తిమార్గాన్ని చూపినదై, భీష్మునకు తల్లియై వర్ధిల్లే ఆకాశగంగకు జన్మస్థానమైన నీ పాదాన్ని ధ్యానం చేస్తాను.

**శా. నీ పుత్రుండు చరాచరప్రతతులన్ నిర్మించి పెంపారఁగా**
**నీ పుణ్యాంగన సర్వజీవతతులన్ నిత్యంబు రక్షింపఁగా**
**నీ పాదోదక మీజగత్త్రయములన్ నిష్పాపులం జేయఁగా**
**నీ పెంపేమని చెప్పవచ్చు సుగుణా! నిత్యాత్మ నారాయణా! 8**

**లఘు టీకా :** ప్రతతులన్ = సమూహాలను; పెంపారఁగా = అతిశయిల్లగా; అంగన = స్త్రీ (భార్య); పెంపు = పెద్దరికం.

**భావం** : సద్గుణాలు, శాశ్వతమైన జ్ఞానస్వరూపం కలిగిన నారాయణా! నీ కుమారుడైన బ్రహ్మ స్థావర జంగమాల సమూహాలను సృష్టించి అతిశయించగా, పుణ్యాత్మురాలైన నీ భార్య లక్ష్మీదేవి సమస్త జీవరాశులను ఎల్లకాలం రక్షిస్తూ ఉండగా, నీ పాదంనుండి జన్మించిన గంగానది ఈ ముల్లోకాలలోని వారి పాపాలను నాశనం చేస్తూ ఉండగా నీ గొప్పదనాన్ని ఏమని చెప్పవచ్చు?

**శా. బ్రహ్మాండావలిలోన సత్వగుణివై బాహ్యంబునం దాదిమ**
**బ్రహ్మాఖ్యం బరతత్వబోధములకున్ భవ్యాధినాథుండవై**
**బ్రహ్మేంద్రామర వాయుభుక్పతులకున్ భవ్యాధినాథుండవై**
**జిహ్మవ్యాప్తుల నెన్న నాదు వశమే చిద్రూప నారాయణా! 9**

**లఘు టీకా :** ఆవలి = వరుస; ఆదిమ బ్రహ్మ+ఆఖ్యన్ = మొదటి బ్రహ్మ అనే పేరుతో; భవ్య + అధినాథుండవు = మేటి నాయకుడవు; వాయుభుక్ + పతులకున్ = గాలిని ఆహారంగా స్వీకరించే నాగులకు అధిపతులైన వారికి; జిహ్మ = కుటిలంగా; వ్యాప్తులన్ = వ్యాపించిన నీ తత్త్వాలను; ఎన్న = ఊహించడం; చిత్+రూప = జ్ఞానమే రూపు దాల్చినవాడా!

**భావం** : జ్ఞాన స్వరూపుడవైన నారాయణా! బ్రహ్మాండ సమూహంలో శుద్ధ సత్త్వగుణం కలిగి వెలుపల ఆదిమబ్రహ్మ అనే పేరుతో పరతత్త్వజ్ఞానానికి మేటి ప్రభుడవై బ్రహ్మకు, ఇంద్రునకు, దేవతలకు, నాగరాజులకు ఊహింపరాని మాయతో వ్యాపించి ఉన్న నీ తత్త్వాలను పరిగణించడం నాకు సాధ్యమా?

**మ. ధర సింహాసనమై నభంబు గొడుగై తద్దేవతల్ భృత్యులై**
**పరమామ్నాయము లెల్ల వందిగణమై బ్రహ్మాండ మాగారమై**
**సిరి భార్యామణియై విరించి కొడుకై శ్రీగంగ సత్పుత్రియై**
**వరుసన్ నీ ఘనరాజసంబు నిజమై వర్ధిల్లు నారాయణా! 10**

**లఘు టీకా** : ధర = భూమి; నభంబు = ఆకాశం; పరమ+ఆమ్నాయములు = శ్రేష్ఠమైన వేదాలు; వందిగణము = స్తుతి పాఠకులు; ఆగారము = ఇల్లు; సిరి = లక్ష్మీదేవి; విరించి = బ్రహ్మ; రాజసంబు = రాజఠీవి.

**భావం :** నారాయణా! నీకు ఈ భూమి సింహాసనమై, ఆకాశం గొడుగై, దేవతలంతా సేవకులై, వేదాలు వందిమాగధులై, బ్రహ్మాండం నివాసగృహమై, లక్ష్మీదేవి భార్యయై, బ్రహ్మ కుమారుడై, గంగ కుమార్తెయై విలసిల్లగా నీ రాజరికం వర్ధిల్లుతున్నది.

**మ. మగ మీనాకృతి వార్ధిఁజొచ్చి యసురన్ మర్ధించి యవ్వేదముల్**
**మగుడం దెచ్చి విరించి కిచ్చి యతనిన్ మన్నించి యేపారఁగాఁ**
**బగ సాధించిన దివ్యమూర్తివని నే భావింతు నెల్లప్పుడున్**
**ఖగరాజధ్వజ! భక్తవత్సల! జగత్కారుణ్య! నారాయణా! 11**

**లఘు టీకా :** మీన+ఆకృతి = చేప రూపం; వార్ధి = సముద్రం; మర్దించి = కొట్టి; మగుడన్ = వెనుకకు; మన్నించి = సమ్మానించి; ఏపారన్ = విజృంభిస్తూ; ఖగరాజ ధ్వజ = పక్షిరాజైన గరుత్మండు చిహ్నంగా కల ధ్వజం కలవాడా!

**భావం :** ధ్వజంపై గరుత్మంతుని చిహ్నం కలిగి, భక్తులను ప్రేమతోను, లోకాలను దయతోను చూచే నారాయణా! నీవు మగచేప రూపాన్ని ధరించి, సముద్రంలో ప్రవేశించి, సోమకాసురుని శిక్షించి, వేదాలను తిరిగి తెచ్చి, బ్రహ్మకిచ్చి మన్నించావు. ఆ విధంగా వేదాలను దొంగిలించినవానిపై విజృంభించి పగ సాధించిన నీ మత్స్యావతార రూపాన్ని ఎల్లప్పుడూ స్మరిస్తాను.

**మ. అమరుల్ రాక్షసనాయకుల్ కడకతో నత్యంతసామర్థ్యులై**
**భ్రమరీదండము మందరాచలముగా బాథోనిథిం ద్రచ్చగా**
**దమకించెన్ భువనత్రయంబును గిరుల్ దంతావళుల్ మ్రొగ్గినం**
**గమఠంబై ధరియించి మించిన జగత్కల్యాణ! నారాయణా! 12**

**లఘు టీకా :** కడఁకతో = ప్రయత్నంతో; భ్రమరీదండము = కవ్వం; పాథోనిధి = సముద్రం; త్రచ్చఁగా = చిలుకగా; తమకించెన్ = చలించాయి; గిరుల్ = పర్వతాలు; దంతావళుల్ = ఏనుగులు; మ్రొగ్గినన్ = ప్రక్కకు వాలిపోగా; కమఠంబై = తాబేలై.

**భావం :** నారాయణా! దేవతలు, రాక్షస ప్రముఖులు శ్రద్ధతో గొప్ప సామర్థ్యం కలవారై మందర పర్వతం కవ్వంగా సముద్రాన్ని చిల్కగా ముల్లోకాలు

చలించాయి. పర్వతాలు, దిగ్గజాలు ప్రక్కకు ఒరగగా కూర్మావతారుడవై మంధర పర్వతాన్ని మూపుపై ధరించి లోక కళ్యాణ కారకుడవై శోభించావు.

**శా. భీమాకారవరాహమై భువనముల్ భీతిల్లి కంపింప ను**
**ద్ధామోర్విం గొనిపోయి నీరనిధిలో డాఁగున్న గర్వాంధునిన్**
**హేమాక్షాసురు వీఁకఁదాకి జయలక్ష్మిన్ గారవింపంగ నీ**
**భూమిం దక్షిణదంష్ట్ర నెత్తిన నినుం బూజింతు నారాయణా!** 13

**లఘు టీకా :** భీమ+ఆకార = భయంకరమైన రూపం కల; ఉద్దామ+ఉర్విన్ = సస్యపూర్ణమైన భూమిని; నీరనిధి = సముద్రం; హేమాక్ష+అసురు = హిరణ్యాక్షుడు అనే రాక్షసుని; వీఁకన్+తాకి = పరాక్రమంతో ఎదుర్కొని; దంష్ట్రన్ = కోరతో.

**భావం :** నారాయణా! గర్వాంధుడైన హిరణ్యాక్షుడు సస్యశ్యామలమైన భూమిని తీసికొనిపోయి సముద్రంలో దాగికొనగా భయంకరమైన వరాహ రూపాన్ని ధరించి లోకాలు భయంతో వణకిపోగా అతనిని పరాక్రమంతో ఎదుర్కొని విజయాన్ని సాధించి ఈ భూమిని కుడికోరపై ఎత్తినట్టి నిన్ను పూజిస్తాను.

**శా. స్తంభంబందు నృసింహమై వెడలి యచ్చండాట్టహాసధ్వనుల్**
**దంభోళిం గడువంగ హేమకశిపోద్దండాసురాధీశ్వరున్**
**శుంభద్గర్భము వ్రచ్చి వాని సుతునిన్ శోభిల్ల మన్నించి య**
**జ్జంభారాతిని బ్రీతిఁదేల్చిన నినుం జర్చింతు నారాయణా!** 14

**లఘు టీకా :** చండ = భయంకరమైన; దంభోళిన్ = పిడుగును; కడువంగ = మించగా; హేమకశిప = హిరణ్యకశిపుడు అనే; ఉద్దండ = గొప్ప; అసుర+అధీశ్వరున్ = రాక్షసరాజును; శుంభత్ = ప్రకాశించే; వ్రచ్చి = చీల్చి; జంభ+అరాతిని = జంభుడనే రాక్షసునికి శత్రువైన ఇంద్రుని; తేల్చిన = సంతోషపెట్టిన.

**భావం :** నారాయణా! స్తంభంనుండి నృసింహరూపంతో వెలువడి భయంకరంగా ఉన్న నీ అట్టహాసపు ధ్వనులు పిడుగునే మించగా హిరణ్యకశిపుడనే గొప్ప రాక్షసరాజు యొక్క శోభించే కడుపును చీల్చి అతని కుమారుని కనికరించి ఆ ఇంద్రుని సంతోషపెట్టిన నిన్ను స్మరిస్తాను.

మ. మహియు న్నాకసముం బదద్వయపరీమాణంబుగాఁ బెట్టి యా
గ్రహ మొప్పం బలిమస్తకం బొక పదగ్రస్తంబుగా నెమ్మితో
విహరించింద్ర విరించి శంకరమహావిర్భూతదివ్యాకృతిన్
సహజంబై విలసిల్లు వామన! లసచ్చారిత్ర! నారాయణా! 15

**లఘు టీకా** : పరిమాణంబుగాన్ = కొలతలుగా; గ్రస్తంబుగా = ఆక్రమింపబడినదిగా; నెమ్మితో = సంతోషంతో; లసత్+చారిత్ర = ప్రకాశించే చరిత్ర కలవాడా!

**భావం** : ప్రకాశవంతమైన చరిత్ర కలిగిన నారాయణా! భూమ్యాకాశాలను రెండు అడుగుల కొలతతో ఆక్రమించి కోపంతో బలిచక్రవర్తి తలను ఒక అడుగుతో స్వాధీనం చేసికొని సంతోషంతో విహరించి ఇంద్ర బ్రహ్మ శంకరులు ఆవిర్భవించిన దివ్యమైన వామనరూపం సహజంగా విలసిల్లింది.

మ. ధరణిన్ రక్తమహాహ్రదంబు లెలమిం ద్రైలోక్య నిర్దిష్టమై
పరగం బైతృక తర్పణంబు కొఱకై ప్రఖ్యాతిగాఁ దీవ్రతన్
నిరువయ్యొక్కటిమారు క్షత్రవరులన్ నేపార నిర్జించి త
త్పరశుభ్రాజితరామనామము కడున్ ధన్యంబు నారాయణా! 16

**లఘు టీకా** : హ్రదంబులు = మడుగులు; ఎలమిన్ = ఆనందంతో; త్రైలోక్య నిర్దిష్టమై = ముల్లోకాలచేత చూపబడినదై; పరగన్ = ఒప్పగా; పైతృక తర్పణంబు = పితృకార్యము; పరశు భ్రాజిత = గండ్రగొడ్డలిచేత ప్రకాశించే.

**భావం** : నారాయణా! పితృ తర్పణం కోసం ముల్లోకాలు వేలెత్తి చూపేవిధంగా భూమిపై రక్తపు మడుగులను ఏర్పరచడానికి ఉద్వేగంతో ఇరవై ఒక్కసార్లు రాజులను సంహరించిన పరశువు చేత ప్రకాశించే నీ రామనామం ఎంతో ధన్యమైనది.

మ. వరుసం దాటకిఁ జంపి కౌశికు మఘస్వాస్థ్యంబు గావించి శం
కరు చాపం బొగిఁ ద్రుంచి జానకిఁ దగం గల్యాణమై తండ్రి పం
పరుదారన్ వనభూమికేఁగి జగదాహ్లాదంబుగా రావణున్
ధరణింగూల్చిన రామనామము కడున్ ధన్యంబు నారాయణా! 17

**లఘు టీకా :** కౌశికు = కుశికుని కుమారుడైన విశ్వామిత్రుని యొక్క; మఘ = యజ్ఞమునకు; స్వాస్థ్యంబు = నెమ్మదిని (రక్షణను); ఒగిన్ = బాగుగా; అరుదారన్ = అపూర్వంగా.

**భావం :** నారాయణా! క్రమంగా తాటికిని చంపి, విశ్వామిత్రుని యజ్ఞాన్ని కాపాడి, శివుని విల్లు విరిచి, సీతను పెండ్లాడి, తండ్రి పంపగా వనవాసానికి వెళ్ళి లోకాలు ఆనందించే విధంగా రావణుని సంహరించిన నీ రామనామం ఎంతో ధన్యమైనది.

**మ. యదువంశంబునఁ గృష్ణు కగ్రజుఁడవై యాభీల శౌర్యోన్నతిన్**
**మదవద్ధేనుక ముష్టికాద్యసురులన్ మర్దించి లీలారసా**
**స్పదకేళీరతి రేవతీవదన కంజాతాంతభృంగంబనన్**
**విదితంబౌ బలరామమూర్తివని నిన్ వీక్షింతు నారాయణా! 18**

**లఘు టీకా :** అగ్రజుఁడవై = అన్నవై; ఆభీల =భయంకరమైన; మదవత్ = గర్వం కలిగిన; మర్దించి = అణచి (చంపి); లీలా = విలాసంతో కూడిన; రస+ఆస్పద = శృంగార రసానికి స్థానమైన; కేళీ = క్రీడయందు; రతి = ఆసక్తి కలిగి; విదితంబు = ప్రకటింపబడినది.

**భావం :** నారాయణా! యాదవ వంశంలో శ్రీకృష్ణునకు అన్నవై భయంకరమైన గొప్ప శౌర్యంతో గర్వాంధులైన ధేనుకుడు, ముష్టికుడు మొదలైన రాక్షసులను చంపి శృంగార రసానికి స్థానమైన క్రీడలో ఆసక్తి కలిగి రేవతిదేవి యొక్క ముఖమనే పద్మంలోని తుమ్మెదగా తెలియబడిన బలరామ రూపుడవని నిన్ను దర్శిస్తాను.

**మ. పురముల్మూఁడును మూఁడులోకములు నేప్రొద్దున్విదారింపఁ ద**
**త్పురనారీ మహిమోన్నతుల్ సెడుటకై బుద్ధుండవై బుద్ధితో**
**వరబోధద్రుమ సేవఁజేయుటకునై వారిం బ్రబోధించి య**
**ప్పురముల్ గెల్చిన మీయుపాయము జగత్పూజ్యంబు నారాయణా! 19**

**లఘు టీకా :** విదారింపన్ = నాశనం చేయడానికి; బోధద్రుమ = బోధివృక్షము యొక్క.

**భావం :** నారాయణా! త్రిపురాలు ముల్లోకాలను నాశనం చేస్తుండగా ఆ త్రిపురాలలోని స్త్రీల పాతివ్రత్యం చెడగొట్టడానికి బుద్ధుడవై తెలివితో బోధివృక్షాన్ని సేవించండని వారికి ఉపదేశించి ఆ త్రిపురాలను గెల్చిన నీ ఉపాయం లోకపూజ్యం కదా!

**మ. కలిధర్మంబునఁ బాపసంకలితులై గర్వాంధులై తుచ్ఛులై**
**కులశీలంబులు మాని హేయగతులం గ్రొవ్వారు దుష్టాత్ములం**
**బలిగాఁ జేయఁ దలంచి ధర్మ మెలమిం బాలించి నిల్పంగ మీ**
**వలనం గల్క్యవతార మొందఁగల నిన్ వర్ణింతు నారాయణా! 20**

**లఘు టీకా :** పాప సంకలితులై = పాపపు పనులతో కూడినవారై; హేయ గతులన్ = అసహ్యమైన ప్రవర్తనలతో; క్రొవ్వారు = గర్వించే.

**భావం :** నారాయణా! కలికాలపు ధర్మానికి లొంగినవారై పాపపు పనులను చేస్తూ గర్వం చేత గ్రుడ్డివాళ్ళై, నీచులై, కుల మర్యాదలు సద్గుణాలు లేనివారై అసహ్యపడే ప్రవర్తనతో చెలరేగిన దుర్మార్గులను బలి చేయడానికి, లోకంలో ధర్మాన్ని నిలుపడానికి కల్కి రూపాన్ని పొందనున్న నిన్ను వర్ణిస్తాను.

**మ. ఇరవొందన్ సచరాచరప్రతతులన్నెన్నంగ శక్యంబుకా**
**కరయన్ పద్మభవాండ భాండచయమున్నారంగ మీకుక్షిలో**
**నరుదారన్నుదయించుఁ బెంచు నడఁగున్నన్నారికేళోద్భవాం**
**తరవాఃపూరము చందమొంది యెపుడున్ దైత్యారి నారాయణా! 21**

**లఘు టీకా :** ఇరవొందన్ = స్థిరంగా; ప్రతతులన్ = విస్తృతులను (సమూహాలను); పద్మభవాండ = బ్రహ్మాండం అనే; భాండ చయమున్ = కుండల సమూహాన్ని; ఆరంగ = నిండగా; అరుదారన్ = అపురూపంగా; అడఁగున్ = ఉపశమనాన్ని పొందుతుంది; నారీకేళ + ఉద్భవ+ అంతర + వాఃపూరము = కొబ్బరికాయలో పుట్టిన లోపలి నిండు జలం; దైత్య+అరి = రాక్షసులకు శత్రువైన విష్ణువు.

**భావం :** రాక్షసవైరివైన నారాయణా! లెక్కపెట్టలేని స్థావర జంగమాలతో నిండిన బ్రహ్మాండ భాండాలను కొబ్బరికాయలోని నీళ్ళను వలె ఎల్లప్పుడూ నీ కడుపులో పుట్టించి, పోషించి, అంతం చేస్తుంటావు కదా!

**మ. దళదిందీవర నీలనీరదసముద్యద్భాసితాకార! శ్రీ**
**లలనా కౌస్తుభచారువక్ష! విబుధశ్లాఘోద్భవస్థాన కో**
**మలనాభీ చరణారవింద జనితామ్నాయాద్య గంగా! లస**
**జ్జలజాతాయతనేత్ర! నిన్ను మదిలోఁ జర్చింతు నారాయణా! 22**

**లఘు టీకా :** దళత్ = వికసిస్తున్న; ఇందీవర = నల్ల కలువ వలె; నీల నీరద = నల్లని మేఘం వలె; సముద్యత్ = పైకి వ్యాపించడం వలన; భాసిత = ప్రకాశించే; శ్రీలలనా = లక్ష్మి చేత; చారు = అందమైన; విబుధ = దేవతల (పండితుల) చేత; శ్లాఘ = పొగడబడే; ఉద్భవస్థాన = జన్మస్థలాలైన; కోమల = సున్నితమైన; నాభీ = బొడ్డు; చరణ + అరవింద = పాదపద్మాలనుండి; జనిత = పుట్టిన; ఆమ్నాయ + ఆద్య = వేదాలకు మొదటివాడైన బ్రహ్మ; గంగా = గంగానది కలవాడా; లసత్ = ప్రకాశించే; జలజాత + ఆయత నేత్ర = పద్మం వంటి విశాలమైన కన్నులు గలవాడా; చర్చింతు = ఆలోచిస్తాను.

**భావం :** నారాయణా! వికసిస్తున్న నల్ల కలువలాగా, నల్లని మేఘం లాగా అతిశయించే రూపం కలవాడవు. లక్ష్మీదేవి, కౌస్తుభ మణుల చేత అందంగా ఉన్న వక్షఃస్థలం కలవాడవు. సున్నితాలైన నీ నాభి బ్రహ్మకు, పాదపద్మాలు గంగకు జన్మస్థాలలై దేవతల చేత ప్రశంసింపబడ్డాయి. పద్మాల వలె విశాలమైన కన్నులు కలవాడవు. అటువంటి నీ గురించి ఆలోచిస్తాను.

**మ. జగదాధారక! భక్తవత్సల! కృపాజన్మాలయాపాంగ! భూ**
**గగనార్కేందుజలాత్మ పావక మరుత్కాయా! ప్రదీపప్రయో**
**గిగణస్తుత్య! మహాఘనాశన! లసద్గీర్వాణసంసేవితా!**
**త్రిగుణాతీత! ముకుంద! నాదు మదిలో దీపింపు నారాయణా! 23**

**లఘు టీకా :** జగత్ + ఆధారక = ప్రపంచానికి కారణమైనవాడా; జన్మ + ఆలయ = పుట్టినిల్లు; అపాంగ = కడకంటి చూపు కలవాడా; పావక = అగ్ని; మరుత్ = గాలి; ప్రదీప = దీపాలను వెలిగించిన; ప్రయోగి గణ = మహాయోగుల సమూహం చేత; స్తుత్య = పొగడబడేవాడా; మహా + అఘ + నాశన = గొప్ప పాపాలను నాశనం చేసేవాడా; లతస్ = ప్రకాశమానులైన; గీర్వాణ = దేవతల చేత; సంసేవితా = పూజింప బడినవాడా; ముకుంద = మోక్షము నిచ్చేవాడా!

**భావం :** నారాయణా! నీవు ప్రపంచానికి కారణమైనవాడవు. భక్తులపై ప్రేమ కలవాడవు. దయకు పుట్టినిల్లైన కడకంటి చూపు కలవాడవు. భూమి ఆకాశం సూర్యుడు చంద్రుడు నీరు జీవుడు అగ్ని వాయువు మొదలైనవి కలిగిన ఈ జగత్తే శరీరంగా కలవాడవు. జ్ఞానంతో ప్రకాశించే మహాయోగుల చేత పొగడబడే వాడవు. గొప్ప పాపాలను నాశనం చేసేవాడవు. కాంతిమంతులైన దేవతల చేత పూజింపబడే వాడవు. సత్త్వరజస్తమో గుణాలు అంటనివాడవు. మోక్షాన్ని ఇచ్చేవాడవు. అటువంటి నీవు నా మనస్సులో ప్రకాశిస్తూ ఉండు.

**శా. భూతవ్రాతము నంబుజాసనుఁడవై పుట్టింతు విష్ణుండవై**
**ప్రీతిం బ్రోతు హరుండవై చెఱుతు నిర్భేద్యుండవై త్రైగుణో**
**పేతంబై పరమాత్మవై నిలుతు నీపెంపెవ్వరుం గాన ర**
**బ్జాతోద్భూత సుజాత పూజిత పదాబ్జశ్రేష్ఠ! నారాయణా! 24**

**లఘు టీకా :** భూత వ్రాతము = ప్రాణుల సమూహాన్ని; అంబుజ + ఆసనుడవై = పద్మంపై కూర్చునే బ్రహ్మవై; అప్ + జాత +ఉద్భూత = నీటిలో పుట్టిన కమలం నుండి జన్మించిన బ్రహ్మ చేత; సుజాత = మంచి పుట్టుక కల దేవతల చేత.

**భావం :** బ్రహ్మ చేతను, దేవతల చేతను పూజింపబడే గొప్ప పాదపద్మాలు గల నారాయణా! బ్రహ్మవై ప్రాణికోటిని సృష్టిస్తావు. విష్ణుమూర్తివై కాపాడుతావు. శివుడవై నాశనం చేస్తావు. భేదింపరాని వాడవై, సత్త్వరజస్తమో గుణాలతో కూడిన వాడవై, పరమాత్ముడవై విలసిల్లుతావు. నీ మాహాత్మ్యాన్ని ఎవ్వరూ తెలిసికొనలేరు.

**మ. వరనాభీధవళాంబుజోదరమునన్ వాణీశుఁ గల్పించి య**
**ప్పురుషశ్రేష్ఠుని ఫాలమందు శివునిం బుట్టించి యామేటికిం**
**బరమోత్తంసముగా వియత్తలనదిం బాదంబులం గన్న మీ**
**సరి యెవ్వారలు మీరు దక్కఁగ రమాసాధ్వీశ నారాయణా! 25**

**లఘు టీకా :** వర = శ్రేష్ఠమైన; నాభీ = బొడ్డు అనే; ధవళ + అంబుజ + ఉదరమునన్ = తెల్లతామర గర్భంలో; పరమ + ఉత్తంసముగా = శ్రేష్ఠమైన సిగబంతిగా; వియత్ + తల నదిన్ = ఆకాశగంగను; రమా సాధ్వీ + ఈశ = లక్ష్మి అనే పతివ్రతకు భర్తవైనవాడా!

**భావం** : లక్ష్మీనాథుడవైన నారాయణా! నీ తెల్లని బొడ్డు తామరలో బ్రహ్మను, ఆ బ్రహ్మ నుదుటినుండి శివుణ్ణి, ఆ శివునకు తలపువ్వుగా ఉండడానికి ఆకాశగంగను పాదాలనుండి పుట్టించిన మీతో సమానులు మీరు కాక వేరెవ్వరున్నారు?

**మ. ప్రభ మీనాభి జనించినట్టి విలసత్పద్మోరుసద్మంబునం**
**బ్రభవంబైన విరించి ఫాలజనితప్రస్వేదసంభూతుఁడై**
**యభిధానంబును గోరి కాంచెను భవుం డార్యేశు లూహింపఁగా**
**నభవాఖ్యుండవు నిన్నెఱుంగ వశమే యబ్జాక్ష నారాయణా! 26**

**లఘు టీకా :** ప్రభన్ = తేజస్సుతో; విలసత్ = ప్రకాశించే; పద్మ + ఉరు + సద్మంబునన్ = కమలమనే గొప్ప భవనంలో; ప్రభవంబు + ఐన = జన్మించిన; ఫాల జనిత = నుదుటినుండి పుట్టిన; ప్రస్వేద = గొప్ప చెమట నుండి; సంభూతుడై = పుట్టినవాడై; అభిదానంబును = పేరును; భవుండు = శివుడు; ఆర్య + ఈశులు = ఏకాదశ రుద్రులు; అభవ + ఆఖ్యుండవు = అభవుడు (పుట్టుక లేనివాడు) అనే పేరు గలవాడవు; అప్ + జ + అక్ష = నీటిలో పుట్టిన తామరల వంటి కన్నులు కలవాడా!

**భావం** : కమల లోచనుడవైన నారాయణా! నీ నాభి కమలం నుండి జన్మించిన బ్రహ్మ నొసటి చెమట నుండి శివుడు జన్మించి కోరి కోరి భవుడు (పుట్టినవాడు) అనే పేరును పొందాడు. ఏకాదశ రుద్రులు భావించినట్లు అభవుడు (పుట్టుక లేనివాడు) అనే పేరు పొందిన నీ గురించి తెలుసుకొనడం ఎవరికైనా సాధ్యమౌతుందా?

**మ. పటుగర్భాంతరగోళభాగమున నీబ్రహ్మాండభాండంబు ప్రా**
**కటదివ్యాద్భుతలీలఁ దాల్చి మహిమం గల్పాంత మంభోధిపై**
**వటపత్రాగ్రముఁ జెంది యొప్పిన మిమున్ వర్ణింపఁగా శక్యమే**
**నిటలాక్షాంబురుహాసనాదికులకున్ నిర్వాణ నారాయణా! 27**

**లఘు టీకా :** పటు = సమర్థమైన; ప్రాకట = ప్రసిద్ధమైన; వటపత్ర + అగ్రము = మఱ్ఱియాకుపైన; నిటల + అక్ష = ఫాలనేత్రుడైన శివునకు; అంబురుహ + ఆసన = నీట బుట్టిన తామర ఆసనంగా గల బ్రహ్మకు; నిర్వాణ = మోక్ష స్వరూపుడ వైనవాడా!

**భావం** : మోక్షస్వరూపుడవైన నారాయణా! కడుపులో ఈ బ్రహ్మాండభాండాన్ని సమర్థంగాను, అద్భుతంగాను ధరించి, ప్రళయకాలంలో సముద్రం మీద మఱ్ఱియాకు మీద మహిమతో విలసిల్లిన విధానాన్ని వర్ణించడం శివుడు, బ్రహ్మ మొదలైన వారికి సాధ్యమా?

**మ. సవిశేషోరుసువర్ణ బిందువిలసచ్చక్రాంకలింగాకృతిన్**
**భవుచే నుద్ధవుచేఁ బయోజభవుచేఁ బద్మారిచే భానుచే**
**దివిజేంద్రాది దిశాధినాయకులచే దివ్యన్మునీంద్రాళిచే**
**నవదివ్యార్చన లందుచుందువు రమానారీశ! నారాయణా! 28**

**లఘు టీకా** : ఉరు = గొప్పనైన; సువర్ణ = మంచి వన్నె కలిగిన బంగారంతో (వర్ణ మంటే అక్షరమని కూడా అర్థం. ఇక్కడ `సువర్ణ' అంటే మంచివైన బీజాక్షరాలతో); బిందు = బిందువు వంటి చిద్రూపంతో; విలసత్ = ప్రకాశించే; చక్ర + అంక = సుదర్శన మనే పేరు గల చక్రంతో; లింగ + ఆకృతిన్ = లింగం యొక్క రూపాన్ని; భవుచేన్ = శివుని చేత; ఉద్ధవునిచేన్ = శ్రీకృష్ణుని మంత్రి చేత; పయోజభవుచే = బ్రహ్మచే; దిశా + అధినాయకులచే = అష్ట దిక్పాలకులచేత; దీవ్యత్ = ప్రకాశించే; నవ = క్రొత్త; రామానారీ + ఈశ = లక్ష్మి అనే స్త్రీకి భర్తవైన శ్రీహరీ.

**భావం** : లక్ష్మీపతివైన నారాయణా! విశేషంగా బీజాక్షరాలతో, చిద్రూపంతో ప్రకాశించే నీ సుదర్శన చక్రమనే లింగరూపం ధరించి శివుడు, ఉద్ధవుడు, బహ్మ, చంద్రుడు, సూర్యుడు, ఇంద్రుడు, అష్టదిక్పాలకులు, దివ్యజ్ఞానులైన మహర్షులు మొదలైన వారిచేత నిత్యనూతనంగా దివ్యమైన పూజలను అందుకుంటావు కదా!

**శా. సర్వంబున్ వసియించు నీతనువునన్ సర్వంబునం దుండఁగా**
**సర్వాత్మా! వసియించు దీవని మదిన్ సార్థంబుగాఁ జూచి యా**
**గీర్వాణాదులు వాసుదేవుఁ డనుచున్ గీర్తింతు రేప్రొద్దు నా**
**శీర్వాదంబు భవన్మహామహిమ లక్ష్మీనాథ నారాయణా! 29**

**లఘు టీకా** : గీర్వాణ + ఆదులు = దేవతలు మొదలైనవారు; వాసుదేవుడు = జగత్తంతా ప్రకాశించే విష్ణువు.

**భావం :** అన్నింటికీ ఆత్మయైన వాడవు, లక్ష్మీపతివి అయిన నారాయణా! నీలో సర్వం ఉంతుందని, నీవు అన్నింటా ఉంటావని అర్థం చేసికొన్న దేవతలు మొదలైనవారు ఎల్లప్పుడు నిన్ను వాసుదేవుడవని పొగడుతారు. నీ మహిమాన్వితత్వమే నాకు ఆశీర్వాదం కదా!

**మ. గగనాద్యంచిత పంచభూతమయమై కంజాత జాండావలిన్**
**సగుణబ్రహ్మమయాఖ్యతం దనరుచున్ సంసారివై చిత్కళా**
**సుగుణంబై విలసిల్లు దీవు విపులస్థూలంబు సూక్ష్మంబునై**
**నిగమోత్తంస! గుణావతంస! సుమహా నిత్యాత్మ నారాయణా!** 30

**లఘు టీకా :** అంచిత = ఒప్పిన; కంజాతజ + అండ + ఆవలిన్ = బ్రహ్మాండాల వరుసను; ఆఖ్యతన్ = పేరుతో; తనరు = ఒప్పు; స్థూలంబు = పెద్దది; నిగమ + ఉత్తంస = వేదాలు భూషణాలుగా కలవాడా; గుణ + అవతంస = సద్గుణాలు అలంకారాలుగా కలవాడా.

**భావం :** వేదాలు, సద్గుణాలు అలంకారాలుగా గలిగి. మంచిది, మహత్తరమైనది, శాశ్వతమైనది అయిన ఆత్మ కలిగిన నారాయణా! ఆకాశం మొదలైన పంచభూతాలతో కూడిన బ్రహ్మాండంలో సగుణబ్రహ్మవనే పేరుతో సంసారివై జ్ఞానంతోను, నూతన కళలతోను నీవు విలసిల్లుతూ ఉంటావు.

**మ. ఎలరారన్ భవదీయనామకథనం బేమర్త్యచిత్తంబులోఁ**
**బొలుపారం దగిలుండునేని యఘముల్ పొందంగ నెట్లోపెడున్**
**గలయం బావకుచేతఁ బట్టువడు నక్కాష్ఠంబుపైఁ గీటముల్**
**నిలువన్నేర్చునె భక్తపోషణ! కృపానిత్యాత్మ నారాయణా!** 31

**లఘు టీకా :** ఎలరారన్ = ఒప్పునట్లుగా; మర్త్య = మానవుని; పొలుపారన్ = ప్రకాశించగా; ఎట్లు + ఓపెడున్ = ఎలా సాధ్యపడుతుంది?; కలయన్ = కూడగా, కలువగా; పావకు చేతన్ = అగ్ని చేత; ఆ + కాష్ఠంబుపై = ఆ కఱ్ఱపైన; కీటముల్ = పురుగులు.

**భావం :** భక్తులను పోషించే దయగల శాశ్వతమైన ఆత్మ కలిగిన నారాయణా! ఏ మానవుని మనస్సులో నీ నామజపం తగిలి ఉంటుందో అతడు

పాపాలను పొందడం ఎలా సాధ్యపడుతుంది? మండుతున్న కఱ్ఱపై ఉన్న పురులుగు నిలువగలవా?

**మ. కలయం దిక్కులు నిండి చండతరమై కప్పారు మేఘౌఘముల్**
**వెలయన్ ఘోరసమీరణస్ఫురణచే వే పాయు చందంబునన్**
**జలదంభోళిమృగాగ్ని తస్కర రుజా శత్రూరగవ్రాతముల్**
**దొలఁగున్నీదగు దివ్యమంత్రపఠనన్ దోషఘ్న నారాయణా! 32**

**లఘు టీకా :** కలయన్ = కూడగా; చండతరమై = దట్టంగా; కప్పారు = ఆవరించిన; మేఘ + ఓఘముల్ = మబ్బుల గుంపులు; వెలయన్ = పుట్టిన; సమీరణ స్ఫురణచే = గాలులు వీచడం వల్ల; వే = వేగంగా; పాయు = తొలగిపోయే; దంభోళి = పిడుగు యొక్క; రుజా = రోగాల యొక్క; ఉరగ వ్రాతముల్ = పాముల సమూహాలు; దోషఘ్న = పాపాలను నశింపజేసేవాడా!

**భావం :** పాపాలను నాశనం చేసే నారాయణా! అన్ని దిక్కుల్లో దట్టంగ అలముకున్న మేఘాలు తీవ్రంగా వీచే గాలి వల్ల చెల్లా చెదరవుతాయి. అలాగే నీ మంత్రాన్ని పఠించడం వల్ల వరదలు, పిడుగులు, క్రూరమృగాలు, అగ్నిప్రమాదాలు, దొంగలు, రోగాలు, శత్రువులు, పాములు మొదలగు వాని వల్ల సంభవించే ఆపదలు తొలగిపోతాయి.

**మ. కలుషాగాధవినాశకారి యగుచుం గైవల్య సంధాయియై**
**నలి నొప్పారెడు మంత్రరాజమగు నీనామంబు ప్రేమంబుతో**
**నలరన్నెవ్వనివాక్కునం బొరయదే నన్నీచు ఘోరాత్మయున్**
**వెలయన్ భూరుహకోటరంబదియ సూ వేదాత్మ నారాయణా! 33**

**లఘు టీకా :** కలుష + అగాధ = అంతులేని పాపాలకు; కైవల్య సంధాయియై = మోక్షాన్ని ఒనగూర్చేదై; నలి = మిక్కిలి; భూరుహ కోటరంబు = చెట్టు తొఱ్ఱ.

**భావం :** వేదమే ఆత్మగా కలిగిన నారాయణా! అంతులేని పాపాలను నాశనం చేసేదై, మోక్షాన్ని సమకూర్చేదై విలసిల్లే గొప్పమంత్రం నీ నామం. దానిని ఎవడైతే నోరార పలుకడో ఆ నీచుని మనస్సు చెట్టుతొఱ్ఱతో సమానం.

**మ. పరమంబై పరతత్త్వమై సకలసంపత్సారమై భవ్యమై**
**సురసిద్ధోరగ యక్షపక్షిముని రక్షోహృద్గుహాభ్యంతర**
**స్థిరసుజ్ఞానసుదీపమై శ్రుతికళాసిద్ధాంతమై సిద్ధమై**
**సరిలేకెప్పుడు నీదు నామ మమరున్ సత్యంబు నారాయణా!** 34

**లఘు టీకా :** పరమంబై = శ్రేష్ఠమై; భవ్యమై = శుభకరమై.

**భావం :** నారాయణా! నీ నామం శ్రేష్ఠమై, పరత్వాన్ని బోధించేదై, అన్ని సంపదలకు నెలవై, శుభకరమై. దేవతలు సిద్ధులు నాగులు యక్షులు పక్షులు మునులు రాక్షసులు మొదలైనవారి హృదయాలనబడే గుహల లోపల స్థిరంగా వెలిగే జ్ఞాన దీపమై, వేదాలకు కళలకు సిద్ధాంతమై, ఎప్పుడూ అందుబాటులో ఉండేదై సాటి లేకుండా విలసిల్లుతున్నది.

**మ. అఘకాఘౌఘతమో దివాకరమునై, యద్రీంద్రజా జిహ్వకున్**
**సుధయై, వేదవినూత్న రత్నములకున్ సూత్రాభిధానంబునై,**
**బుధసందోహ మనోహరాంకురమునై, భూదేవతాకోటికిన్**
**విధులై మీబహునామరాజి వెలయున్ వేదాత్మ నారాయణా!** 35

**లఘు టీకా :** అఘ = పాపాలయొక్క; ఓఘ = సమూహం అనే; తమః = చీకటికి; దివాకరము = సూర్యబింబము; అది + ఇంద్రజా = పర్వతరాజ కుమారి అయిన పార్వతి యొక్క; సూత్ర + అభిధానంబు = దారము అనే పేరు గలది; అంకురము = మొలక; భూదేవతా కోటికిన్ = బ్రాహ్మణుల సమూహానికి; విధులై = అవశ్యం చేయదగినవై.

**భావం :** వేదస్వరూపుడవైన నారాయణా! అసంఖ్యాకంగా ఉన్న నీ నామాలు పాపాల చీకట్లను పారద్రోలే సూర్యబింబాలై, పార్వతీదేవి నాలుకకు అమృత బిందువులై, వేదమంత్రాలు అనబడే రత్నాలను గుదిగుచ్చే దారమై, పండితులకు అందమైన మొలకలై, బ్రాహణులకు నిత్యకర్మ విధానాలై విరాజిల్లుతున్నది.

**మ. పొనరన్ముక్తికిఁ ద్రోవ, వేదములకుం బుట్టిల్లు, మోదంబునం**
**దునికిస్థానము, నిష్టభోగములకున్నుత్పత్తి, యేప్రొద్దునున్**
**ఘనపాపంబులవైరి, షడ్రిపులకున్ గాలావసానంబు మీ**
**వినుతాంఘ్రిద్వయపద్మసేవనగదా విశ్వేశ నారాయణా!** 36

**లఘు టీకా :** పౌనరన్ = ఒప్పగా; షట్ + రిపులకున్ = కామ క్రోధ లోభ మోహ మద్య మాత్సర్యాలు అనబడే అంతశ్శత్రువులకు.

**భావం :** సమస్త విశ్వానికి అధిపతివైన నారాయణా! పొగడబడే నీ పాదపద్మాల సేవయే మోక్షానికి మార్గం, వేదాలకు పుట్టినిల్లు, ఆనందానికి నెలవు, ఇష్టసుఖాలకు మూలకారణం, సర్వదా మహాపాతకాలకు విరోధి, కామక్రోధాది అరిషడ్వర్గానికి అంత్యకాలం అవుతుంది కదా!

**మ. భవరోగంబుల మందు, పాతకతమో బాలార్క బింబంబు, క**
**ర్మ విషజ్వాలసుధాంశుగామృతతుషారవ్రాతపాథోధిమూ**
**ర్తివి కైవల్యపదావలోకన కళాదివ్యాంజనశ్రేష్ఠమై**
**భువిలో మీదగుమంత్రరాజ మమరున్ భూతాత్మ నారాయణా!** 37

**లఘు టీకా :** భవరోగంబుల = సంసారమనే వ్యాధులకు; పాతకతమః = పాపాలనే చీకటికి; బాలార్కబింబంబు = ఉదయించే సూర్యబింబం; సుధా + అంశు = చంద్రుని; గ = పొందిన; తుషార = అమృతం యొక్క; వ్రాత = సమూహం గల; పాథోధి = సముద్రం యొక్క; మూర్తివి = రూపం కలవాడవు; కైవల్యపద = మోక్షపదాన్ని; అవలోకన కళా = చూపించే కళకు.

**భావం :** ప్రాణులకు ఆత్మవైన నారాయణా! నీవు కర్మలనే విషజ్వాలకు చంద్రున్ని పొందిన శీతలామృతరాశి అయిన సముద్రం యొక్క రూపం కలవాడవు. నీ గొప్పమంత్రం సంసార వ్యాధులకు ఔషధం, పాపాలనే అంధకారానికి సూర్యోదయం, మోక్షపదాన్ని చూడగోరే కళకు దివ్యమైన అంజనమై విలసిల్లుతున్నది.

**మ. వరుసన్ గర్మపిపీలికాకృత తనూవల్మీకనాళంబులోఁ**
**బరుషాకారముతో వసించిన మహా పాపోరగశ్రేణికిం**
**బరమోచ్చాటనమై రహస్యమహిమం బాటింపుచున్నుండు మీ**
**తిరుమంత్రంబగు మంత్రరాజ మమరుం దివ్యాత్మ నారాయణా!** 38

**లఘు టీకా :** కర్మ పిపీలికా = కర్మ లనెడు చీమలచేత; కృత = చేయబడిన; తనూ = శరీరమనెడి; నాళంబులో = రంధ్రంలో; పరుష +

ఆకారముతో = ఘోరమైన రూపంతో; వసించిన = నివసించిన; పాప + ఉరగ శ్రేణికి = పాతకాలనెడి పాముల సమూహానికి; పరమ + ఉచ్చాటనము + ఐ = గొప్ప మంత్రమై ; దివ్య + ఆత్మ = అప్రాకృత స్వరూపం కలవాడా!

**భావం :** అప్రాకృతమైన స్వరూపం కలిగిన నారాయణా! క్రమంగా కర్మ లనబడే చీమలచేత చేయబడిన పుట్ట వంటి ఈ దేహంలోని రంధ్రాలలో ఘోరమైన రూపాలతో చేరిన పాపా లనబడే పాముల సమూహాన్ని తరిమి వేసే ఉచ్చాటన గలదై రహస్య మహిమను పాటిస్తున్న 'ఓం నమో నారాయణాయ' అనే నీ తిరుమంత్ర పరిభాష ఒప్పుచున్నది.

**మ. హరుని న్నద్రిజ నాంజనేయుని గుహు న్నయ్యంబరీషున్ ధ్రువుం**
**గరిఁ బ్రహ్లాదు విభీషణాఖ్యుని బలిన్ ఘంటాశ్రవున్ నారదున్**
**గరమొప్పన్ విదురున్ బరాశరసుతున్ గాంగేయునిన్ ద్రౌపదిన్**
**నరు నక్రూరునిఁ బాయకుండును భవన్నామంబు నారాయణా!** 39

**లఘు టీకా :** హరునిన్ = శంకరుని; అద్రిజన్ = పార్వతిని; కరిన్ = ఏనుగును; విభీషణ + ఆఖ్యుని = విభీషణుడు అనే పేరు గలవానిని; ఘంటాశ్రవున్ = ఘంటాకర్ణుని; పరాశర సుతున్ = వ్యాసుని; గాంగేయునిన్ = భీష్ముని; నరున్ = అర్జునుని.

**భావం :** నారాయణా! శివుడు, పార్వతి, ఆంజనేయుడు, గుహుడు, అంబరీషుడు, ధ్రువుడు, ఏనుగు, ప్రహ్లాదుడు, విభీషణుడు, బలి, ఘంటాకర్ణుడు, నారదుడు, విదురుడు, వ్యాసుడు, భీష్ముడు, ద్రౌపది, అర్జునుడు, అక్రూరుడు మొదలైన భాగవతోత్తములను నీ నామం వదలకుండా ఉంటుంది.

**శా. శ్రీకిన్మందిరమైన వక్షము, సురజ్యేష్ఠోద్భవస్థాననా**
**భీకంజాతము, చంద్రికాంతర సుధాభివ్యక్తనేత్రంబులున్,**
**లోకస్తుత్యమరున్నదీజనక మాలోలాంఘ్రియున్ గల్గు నా**
**లోకారాధ్యుడవైన నిన్నెపుడు నాలోఁ జూతు నారాయణా!** 40

**లఘు టీకా :** శ్రీకిన్ = లక్ష్మీదేవికి; మందిరమైన = నివాసమైన; సురజ్యేష్ఠ = తొలివేలుపైన బ్రహ్మకు; ఉద్భవస్థాన = పుట్టినచోటైన; నాభీ కంజాతము = బొడ్డు తామర; చంద్రికా + అంతర = వెన్నెలలో ఉన్న; సుధా =

అమృతాన్ని; అభివ్యక్త = వెదజల్లే; లోక స్తుత్య = లోకులచే పొగడబడే; మరుత్ + నదీ = దేవనది అయిన గంగకు; జనక = జన్మస్థానమైన; మా = లక్ష్మీదేవికి; లోల = ప్రియమైన; అంఘ్రి = పాదం.

**భావం** : నారాయణా! లక్ష్మీదేవికి నివాసమైన నీ వక్షాన్ని, బ్రహ్మకు జన్మస్థానమైన నీ బొడ్డు తామరను, వెన్నెలలోని అమృతాన్ని ప్రసరించే నీ కన్నులను, లోకాలు పొగడే గంగానది పుట్టిన లక్ష్మీదేవి కిష్టమైన నీ పాదాన్ని కలిగి సకల లోకాలకు పూజ్యుడవైన నిన్ను నాలో ఎప్పుడు చూస్తాను? (నిన్ను నాలో ఎల్లప్పుడూ చూస్తూ ఉంటాను).

**శా. విందుల్ విందులటంచు గోపరమణుల్ వ్రేపల్లెలోఁ బిన్ననాఁ**
**డందెల్ మ్రోయఁగ ముద్దుమో మలర నిన్నాలింగితున్ సేయుచో**
**డెందంబుల్ దనివార రాగరసవీటీలీలలన్ దేల్చుమీ**
**మందస్మేరముఖేందురోచులు మమున్ మన్నించు నారాయణా! 41**

**లఘు టీకా** : రాగ = ఎరుపురంగుతో కూడిన; రస = రసవంతమైన; వీటీ = తాంబూలం యొక్క; లీలలన్ = శృంగార చేష్టలలో; తేల్చు = అలరించే; మందస్మేర = చిరునవ్వుతో కూడిన; ముఖ + ఇందు రోచులు = ముఖమనే చంద్రకాంతులు.

**భావం** : నారాయణా! వ్రేపల్లెలో నీ చిన్నతనంలో అందెలు మ్రోగుతుండగా ముద్దుమోముతో అందంగా ఉన్న నిన్ను గోపస్త్రీలు 'విందులు విందులు' అంటూ కౌగిలించుకుని తమ తాంబూలం సేవించిన పెదాలతో ముద్దు పెట్టుకొనగా నీ ముఖ చంద్రబింబం కురిపించే చిరునవ్వుల వెన్నెలలు మమ్ము కాపాడుతాయి.

**శా. విందుల్వచ్చిరి మీయశోదకడకున్ వేగంబె పొమ్మయ్యయో**
**నందానందన! చందనాంకురమ! కృష్ణా! యింకఁ బోవేమి మా**
**మందం జాతరసేయఁ బోదమిదె రమ్మా యంచు మిమ్మెత్తుకో**
**చందంబబ్బిన నుబ్బకుండుదురె ఘోషస్త్రీలు నారాయణా! 42**

**లఘు టీకా** : విందుల్ = చుట్టాలు; నంద + ఆనందన = నందునకు ఆనందాన్ని కూర్చేవాడా; చందన + అంకురమ = గంధపు మొలకా; మందన్

= గొల్లపల్లెలో; ఉబ్బకుండుదురె = సంతోషించకుండా ఉంటారా; ఘోషస్త్రీలు = గొల్లెతలు.

**భావం :** నారాయణా! "నందునకు ఆనందాన్నిచ్చే గంధపు మొలకవైన కృష్ణా! మీ యశోద దగ్గరికి చుట్టాలు వచ్చారు. తొందరగా వెళ్ళిపో. అయ్యయ్యో! ఇంకా పోవడంలే దెందుకు? సరే! మా గొల్లపల్లెలో జాతరకు పోదాం రా!" అంటూ నిన్నెత్తుకొనే అదృష్టం దక్కిన గొల్లెతలు సంతోషించకుండా ఉంటారా?

**శా. అన్నా కృష్ణమ నేఁడు వేల్పులకు మీఁదన్నార మీచట్లలో**
**వెన్నల్ ముట్టకు మన్ననాక్షణమున న్విశ్వాకృతిస్ఫూర్తివై**
**యున్నన్ దిక్కులు చూచుచున్ బెగడి నిన్నోలి న్నుతుల్ సేయుచున్**
**గన్నుల్ మూయ యశోదకున్ జిఱుతవై కన్పించు నారాయణా! 43**

**లఘు టీకా :** చట్లు = ఉట్లు; చిఱుత = చిన్న పిల్లాడవు.

**భావం :** నారాయణా! యశోద "అన్నా! కృష్ణా! దేవతలకు నైవేద్యంగా ముడుపు కట్టాము. ఉట్టిమీది కుండలోని వెన్నను ముట్టకు" అని చెప్పగా వెంటనే విశ్వరూపాన్ని ధరించావు. బెదరి నలుదిక్కులు చూస్తూ, నిన్ను స్తోత్రం చేస్తూ కన్నులు మూసుకొన్న యశోదకు చిన్న బాలుడవై కనిపిస్తుంటావు.

**శా. ఉల్లోలంబులుగాఁ గురుల్ నుదుటిపై నుప్పొంగ మోమెత్తి ధ**
**మ్మిల్లం బల్లలనాడ రాగరస సమ్మిశ్రంబుగా నీవు ప్రే**
**పల్లెందాడుచు గోపగోనివహ గోపస్త్రీల యుల్లంబు మీ**
**పిల్లంగ్రోవిని జుట్టిరాఁ దిగుదు నీ పెంపొప్పు నారాయణా! 44**

**లఘు టీకా :** ఉత్+లోలంబులుగాన్ = కెరటాలవలె; కురుల్ = వెంట్రుకలు; ధమ్మిల్లంబు = కొప్పు; అల్లలన్+ఆడ = చలించగా; రాగ = ప్రేమయొక్క; రస = శృంగారరసం యొక్క; సమ్మిశ్రంబుగా = కలయికగా; తాడుచు = ఒకటిగా పెనవేస్తూ; గో నిహవ = గోవుల సమూహం యొక్క; చుట్టి రాన్ = అనుసరించి రాగా; తిగుచు = చేరదీసే; పెంపు = మహత్వం.

**భావం :** నారాయణా! నుదుటిపై ముంగురులు కెరటాల వలె ఉప్పొంగగా, మోము పైకెత్తి కొప్పు చలిస్తుండగా ప్రేమను శృంగారాన్ని కలగలిపి పేనినట్లుగా సంచరిస్తూ గోపాలుర, గోవుల, గోపస్త్రీల హృదయాలు నీ

మురళీగానాన్ని అనుసరించి రాగా వారిని చేరదీసే నీ గొప్పతనం విలసిల్లుతుంది.

**మ. కసవొప్పన్ పసి మేసి ప్రొద్దుగలుగం గాంతారముం బాసి య**
**ప్పసియున్నీవును వచ్చుచో నెదురుగాఁ బైకొన్న గోపాంగనా**
**రసవద్వృత్తపయోధరద్వయహరిద్రాలేపనామోదముల్**
**పసిఁ గొంచున్ బసిఁగొంచు వచ్చుటలు నే భావింతు నారాయణా! 45**

**లఘు టీకా :** కసవు = గడ్డి; పసి = గోగణం; ప్రొద్దు + కలుగన్ = ప్రొద్దు ఉండగానే; కాంతారమున్ = అడవిని; పాసి = వదలి; పైకొన్న = మీద పడిన; రసవత్ = శృంగార రసం కలిగిన; వృత్త = గుండ్రని; పయోధర = స్తనాల యొక్క; ద్వయ = జంట మీది; హరిద్రా లేపన = పసుపు పూతల; ఆమోదముల్ = వాసనలను; కొంచున్ = ఆఘ్రాణిస్తూ; కొంచు = తీసికొంటూ.

**భావం :** నారాయణా! గడ్డి మేసిన ఆలమందను తీసికొని ప్రొద్దు ఉండగానే అడవిని వదలి నీవు వస్తుండగా ఎదురుగా వచ్చి మీదపడ్డ గోపస్త్రీల సింగారపు గుండ్రని స్తనాల మీది పసుపు పూతల సువాసనలను ఆఘ్రాణిస్తూ వస్తున్న నీ రూపాన్ని నేను భావిస్తాను.

**శా. చన్నుల్ మీఁదికి చౌకళింప నడుముం జవ్వాడ కందర్పసం**
**పన్నాఖ్యంబు నటించు మాడ్కి కబరీభారంబు లూటాడఁగా**
**విన్నాణంబు నటింప గోపజన గోబృందంబుతో వచ్చు మీ**
**వన్నెల్ కన్నుల ముంచి గ్రోలుటలు నే వర్ణింతు నారాయణా! 46**

**లఘు టీకా :** చౌకళింప = చలింపగా; జవ్వాడ = ఊగగా; కందర్ప = మన్మథుని యొక్క; సంపన్న + ఆఖ్యంబు = సంపద అనే పేరు; మాడ్కి = వలె; కబరీ భారంబు = కేశపాశాలు; ఊటాడగా = కదులుతుండగా; విన్నాణంబు = నేర్పరితనం; వన్నెల్ = అందాలు; క్రోలుటలు = త్రాగడమనే చర్యలు.

**భావం :** నారాయణా! చన్నులు పైపైకి కదులుతుండగా, నడుము ఊగాడగా, కేశపాశం కామసంపద అన్నట్లు చలిస్తుండగా, నేర్పరితనంతో

ప్రవర్తిస్తున్న గోపికలతోను, గోవులతోను వస్తున్న నీ అందాలను కన్నులనే గిన్నెలుగా చేసి ముంచి త్రాగడాన్ని వర్ణిస్తాను.

**మ. పెరుగుల్ ద్రచ్చుచు నొక్కగోపిక మిముం బ్రేమంబునం జూచి రా**
**గ రసావేశత రిత్త ద్రచ్చనిడ నాకవ్వంబు నీవున్ మనో**
**హరలీలం గనుఁగొంచు ధేనువని యయ్యాఁబోతునుం బట్టితీ**
**వరవృత్తాంతము లేను పుణ్యకథగా వర్ణింతు నారాయణా! 47**

**లఘు టీకా :** త్రచ్చుచున్ = చిలుకుతూ; రాగరస = ప్రేమరసపు; ఆవేశత = ఆవేశంలో; రిత్తన్ = వట్టి కుండను.

**భావం :** నారాయణా! ఒక గోపిక పెరుగు చిలుకడానికి సిద్ధపడి నిన్ను ప్రేమతో చూసి ఆ ప్రేమావేశంలో కవ్వాన్ని ఉత్తకుండలో పెట్టి చిలుకుతుండగా నీవు ఆమెను మనోహరంగా చూస్తూ ఆవు అనుకొని ఆబోతును పట్టుకున్నావు. ఇటువంటి గొప్ప ఉదంతాలను నేను పుణ్యకథలుగా వర్ణిస్తాను.

**శా. కేలన్ గోలయు గూటిచిక్కము నొగిం గీలించి నెత్తంబునం**
**బీలీపింఛముఁ జుట్టి నెన్నడుమునం బింఛావళిన్ గట్టి క**
**ర్ణాలంకార కదంబగుచ్ఛ మధుమత్తాలీస్వనం బొప్ప నీ**
**వాలన్ గాచిన భావ మిట్టిదని నే వర్ణింతు నారాయణా! 48**

**లఘు టీకా :** కేలన్ = చేతిలో; కోల = కఱ్ఱ; కూటి చిక్కము = చద్దిమూట; ఒగిన్ = వరుసగా; కీలించి = తగిలించి; నెత్తంబునన్ = సిగపై; పీలీపింఛము = నెమలి ఈకను; కదంబ గుచ్ఛ = పూలగుత్తులలోని; మధు = తేనె చేత; మత్త = మత్తెక్కిన; అలీ = తుమ్మెదల యొక్క; స్వనంబు = ఝుంకారాలు.

**భావం :** నారాయణా! చేతిలోని కఱ్ఱకు చద్దిమూటను తగిలించి, తలపై నెమలి ఈకను ధరించి, నడుము చుట్టూ నెమలి ఈకలను చుట్టి, చెవులకు అలంకారాలైన పూగుత్తులలోని మకరందాన్ని గ్రోలిన తుమ్మెదలు ఝుంకారం చేస్తుండగా ఆవులను కాచిన రూపం ఇటువంటిదని నేను వర్ణిస్తాను.

**శా. కాళిందీతటభూమి నాలకదుపుల్ కాలూఁది మేయన్ సము**
**త్తాలాలోల తమాలపాదపశిఖాంతస్థుండవై వేణురం**
**ధ్రాలిన్ రాగరసంబునిండ విలసద్రాగంబు సంధించి గో**
**పాలవ్రాతము గండుగోయిలలుగా వర్ణింతు నారాయణా!** 49

**లఘు టీకా :** కాళిందీ తట భూమిన్ = యమునానది తీరభూమిలో; ఆల కదుపుల్ = ఆవుల మందలు; కాలు + ఊఁది = ప్రవేశించి; సముత్తాల = మిక్కిలి పొడవైన; ఆలోల = కదులుతున్న; తమాల పాదప = చీకటి చెట్టు యొక్క; శిఖా + అంతస్థుండవై = కడకొమ్మ లోపల ఉన్నవాడవై; విలసత్ = శోభించే; సంధించి = కూర్చి; వ్రాతము = సమూహం.

**భావం :** నారాయణా! యమునా తీర భూముల్లోకి ఆల మందలు ప్రవేశించి మేస్తుండగా నీవు ఎత్తైన చీకటిచెట్టు కొనకొమ్మల్లో ఉండి వేణువుతో రసభరితమైన రాగాన్ని ఆలాపించగా నిన్ననుసరించే గోపాలుర సమూహాన్ని గండుకోయిలలుగా వర్ణిస్తాను.

**శా. రాణించెన్ గడునంచు నీసహచరుల్ రాగిల్లి సోలంగ మీ**
**వేణుక్వాణము వీనులంబడి మనోవీథుల్ బయల్ ముట్టఁగా**
**ఘోణాగ్రంబులు మీఁదికెత్తుకొని లాంగూలంబు లల్లార్చి గో**
**శ్రేణుల్ చిందులు ద్రొక్కి యాడుటలు నేఁ జర్చింతు నారాయణా!** 50

**లఘు టీకా :** రాణించెన్ = విలసిల్లినది; రాగిల్లి = రంజిల్లి; సోలంగ = వివశులు కాగా; క్వాణము = నాదం; మనోవీథుల్ = మానసిక స్థితులు; బయల్ ముట్టఁగా = ఆకాశాన్ని అందుకోగా; ఘోణ + అగ్రంబులు = ముక్కుకొనలు; లాంగూలంబులు = తోకలు; అల్లార్చి = ఆడించి.

**భావం :** నారాయణా! నీ మురళీనాదం ఎంతో విలసిల్లిందని నీ సహచరులు ఆనందించి వివశులు కాగా, అది చెవుల బడి మనోభావాలు ఆకాశాన్ని అంటగా ముక్కుల నెత్తి, తోకలను ఊపుతూ ఆవుల మంద చిందులు త్రొక్కి ఆడడాన్ని నేను వర్ణిస్తాను.

**మ. పసులంగాపరి యేమెఱుంగు మధురప్రాయోల్లసద్వృత్తవా**
**గ్విసరారావము మోవిదా వెదురు గ్రోవిం బెట్టి నాఁడంచు నిన్**

**గసటుల్ సేయఁగ నాఁడు గోపికల తద్గానంబులన్ మన్మథ**
**వ్యసనాసక్తులఁ జేయు చందములు నే వర్ణింతు నారాయణా! 51**

**లఘు టీకా :** మధుర ప్రాయ = యౌవనంలో; ఉల్లసత్ = ఆనందించే; వృత్త = వృత్తాంతాలలోని ; వాక్ + విసర = మాటల ప్రసారం కలిగిన; ఆరావము = ధ్వని; మోవిన్ = పెదవిపై; కసటుల్ + చేయఁగన్ = ఎగతాళి చేయడానికి; ఆఁడు = మాటలాడే.

**భావం :** నారాయణా! "మధురమైన యౌవనంలో ఆనందాన్ని కలిగించే రకరకాల మాటల మనోహర ధ్వని పెదవిపై పిల్లనగ్రోవిని పెట్టిన ఈ పశువుల కాపరికి ఏం తెలుసు?" అని చులకనగా మాట్లాడే గోపికలను తన మురళీగానంతో కామక్రీడాసక్తులను చేసే నీ పద్ధతులను వర్ణిస్తాను.

**మ. జడి యెంతేఁ దడవయ్యెఁ జెయ్యి యలసెన్ శైలంబు మాచేతులం**
**దిడుమన్నన్ జిరునవ్వుతో వదలినన్ హీనోక్తి గీపెట్ట నె**
**క్కుడు గోవుల్ బ్రియమంద నింద్రుఁ డడలం గోవర్ధనాద్రీంద్రమున్**
**గొడుగై యుండఁగఁ గేలఁ బూనితి గదా గోవింద నారాయణా! 52**

**లఘు టీకా :** జడ = నిశ్చలంగా ఉన్న శ్రీకృష్ణా! హీన + ఉక్తి = మాట రాక; కీపెట్టన్ = కేకలు పెట్టగా; ఎక్కుడు = మిక్కిలిగా; అడలన్ = భయపడగా; కేలన్ = చేతిలో; గోవింద = గోవులకు ఆనందాన్ని కలిగించే కృష్ణా!

**భావం :** గోవులకు ఆనందాన్ని కలిగించే నారాయణా! "చైతన్యం లేకుండా స్థిరంగా నిలిచిన కృష్ణా! చాలా కాలమయింది. నీ చేయి అలసిపోయింది. పర్వతాన్ని మా చేతులలో పెట్టు" అని గోపజనులు కోరగా చిరునవ్వుతో దానిని వదిలావు. వారు నోట మాట రానివారై కీపెట్టారు. గోవులు సంతోషించగా, ఇంద్రుడు భయపడగా గోవర్ధన పర్వతాన్ని గొడుగుగా చేత ధరించావు కదా!

**మ. లలితాకుంచితవేణియం దడవిమొల్లల్ జాఱ ఫాలస్థలిన్**
**దిలకం బొయ్యన జాఱఁ గుండల రుచుల్ దీపింప లేఁజెక్కులన్**
**మొలకన్నవ్వుల చూపులోరగిల మేన్మువ్వంకలన్ బోవఁగా**
**నలి గైకొందువు గాదె నీవు మురళీనాట్యంబు నారాయణా! 53**

**లఘు టీకా :** లలిత = అందంగా; అకుంచిత = ముడిచిన; ఓరగిల = ప్రక్కకు వాలగా; ముప్వంకలన్ (మూడు + వంకలన్) పోవగా = మూడు మల్కలై పోగా; నలిన్ = యొగ్యంగా; కైకొందువు = పూనుకుంటావు.

**భావం :** నారాయణా! అందంగా ముడిచిన జడలోని మల్లెపూలు జారగా, నుదుట పెట్టిన బొట్టు మెల్లగా జారుతుండగా, లేత చెక్కిళ్ళపై కుండాలలు ప్రకాశిస్తుండగా, చిరునవ్వులతో కూడిన చూపులు ప్రక్కలకు వాలుతుండగా, శరీరం మూడు వంకల తిరుగగా నీవు మురళిని వాయిస్తూ నాట్యం చేస్తావు.

**శా. మా పాలం గడు గ్రొవ్వి గోపికలతో మత్తిల్లి వర్తింతువే**
**మా పాలెంబుల వచ్చియుండుదు వెసన్మాపాలలో నుండుమీ**
**మా పాలైన సుఖాబ్ధిలో మునుగుచున్ మన్నించి తా గొల్లలన్**
**మాపాలం గల వేల్పు నీవె యని కా మన్నింతు నారాయణా! 54**

**లఘు టీకా :** క్రొవ్వి = బలిసి; పాలెంబుల = పల్లెలలో; వెసన్ = వెంటనే; మా పాలలోన్ = మా పక్షాలలో; మా పాలు+ఐన = మా వంతైన; కా = కదా.

**భావం :** నారాయణా! "మా ఆవుల పాలను త్రాగి బలిసి, గోపికలతో మదించి ప్రవర్తిస్తావు కదా! మా పల్లెలకు వచ్చి ఉండు. మా పక్షాన ఉండుము" అన్న గొల్లలను వారి వంతైన సుఖసాగరంలో మునుగుతూ కాపాడే మా దేవుడవు నీవే అని భావిస్తాను.

**మ. ఒక కాంతామణి కొక్కడీవు మఱియున్నొక్కర్తె కొక్కండవై**
**సకలస్త్రీలకు సంతసంబలర రాసక్రీడ తన్మధ్య క**
**ల్పకమూలంబున వేణునాదరస మొప్పంగా, బదార్వేలగో**
**పికలం జెంది వినోద మొందునెడ నీ పెంపొప్పు నారాయణా! 55**

**లఘు టీకా :** రాసక్రీడ = గోపికలతో కృష్ణుడు మండలాకారంగా చేసిన నృత్యం.

**భావం :** నారాయణా! ఒక్కొక్క స్త్రీకి నీవు ఒక్కొక్కడవై, స్త్రీలందరికీ సంతోషం కలుగగా రాసక్రీడ లాడుతూ, వారి మధ్య కల్పవృక్షం క్రింద

వేణునాదం చేస్తూ, పదహారు వేల గోపికలకు వినోదాన్ని అందించే సమయంలో నీ గొప్పతనం విలసిల్లుతుంది.

**మ. లలితంబైన భవత్తనూవిలసనన్ లావణ్యదివ్యామృతం**
**బలుఁగుల్వారఁగ నీకటాక్షమునఁ దామందంద గోపాంగనల్**
**తలఁపుల్పాదులుకట్టి కందళితనూత్నశ్రీలు వాటింతురా,**
**నెలతల్ తీవెలు చైత్రవిస్ఫురణమౌ నీయొప్పు నారాయణా! 56**

**లఘు టీకా :** లలితంబు+ఐన = సుకుమారమైన; భవత్ = నీ; తనూ = శరీరం యొక్క; విలసనన్ = విన్యాసం వలన; లావణ్య = సౌందర్యమనే; అలుగుల్ + పారగ = పొరలి ప్రవహించగా; కటాక్షమునన్ = కడగంట; కందళిత = మొలకెత్తిన; చైత్ర విస్ఫురణమౌ = చిత్రంగా శోభించే; ఒప్పు = సమ్మతిని.

**భావం :** నారాయణా! సుకుమారమైన నీ శరీర విన్యాసం వల్ల సౌందర్యమనే అమృతం నీ కడగంట ప్రవహిస్తుంటే గోపికలు తమ భావాలనే పాదులు కట్టి, క్రొత్త సంపదలు అంకురించిన లతలై చిత్రంగా శోభించే నీ సమ్మతిని పాటిస్తారు.

**శా. లీలన్ బూతకి ప్రాణవాయువులు పాలిండ్లందు వెళ్ళించి, దు**
**శ్శీలుండై చను బండిదానవు వెసం జిందై పడం దన్ని, యా**
**రోలన్మద్దులు గూల్చి, ధేనుదనుజున్ రోఁజంగ నీల్గించి, వే**
**కూలం గంసునిఁ గొట్టి గోపికల కోర్కుల్ దీర్తు నారాయణా! 57**

**లఘు టీకా :** వెళ్ళించి = పోగొట్టి; బండిదానవు = శకటాసురుని; చిందై = శిథిలమై; మద్దులు = మద్దిచెట్లను; ధేనుదనుజున్ = ధేనుకాసురుని; రోజంగ = రొప్పగా; నీల్గించి = చంపి.

**భావం :** నారాయణా! విలాసంగా పూతన ప్రాణాలను పాలిండ్లనుండి తీసి, దుర్మార్గుడై వచ్చిన శకటాసురుని ముక్కలై పడగా తన్ని, రోటితో మద్దిచెట్లను కూల్చి, ధేనుకాసురుని చంపి, కంసుని పడగొట్టి గోపికల కోరికలను తీర్చినావు.

**మ. రసనాగ్రంబున నీదు నామరుచియున్ రమ్యంబుగాఁ జెవ్లకు**
**న్నసలారంగ భవత్కథాభిరతియున్ హస్తాబ్జ యుగ్మంబులన్**

**వెస నీపాదసుపూజితాదియుగమున్ విజ్ఞాన మధ్యాత్మకున్**
**వెస నింపొందనివాఁడు దాఁ బశువు సూ వేదాత్మ నారాయణా!** 58

**లఘు టీకా :** రసన + అగ్రంబున = నాలుక కొనపై; నసలు + ఆరంగ = దురద తీరే విధంగా; అభిరతియున్ = అసక్తి కూడ; యుగ్మంబులన్ = జంటలను; అధ్యాత్మకున్ = మనస్సుకు; వెస = వెంటనే.

**భావం :** వేదాలే ఆత్మగా కలిగిన నారాయణా! నాలుకపై నీ నామ సంకీర్తన రుచి ఇంపు. చెవుల నస తీరే విధంగా నీ కథలను వినాలనే ఆసక్తి ఇంపు. పద్మాలవంటి రెండు చేతులతో నీ పాదాలను పూజించడం ఇంపు. మనస్సు జ్ఞానాన్ని పొందడం ఇంపు. ఇవి పొందని వాడు పశువుతో సమానం కదా!

**మ. వరకాళిందితరంగడోలికలలో వైకుంఠధామంబులో**
**వెరవొప్పార నయోధ్యలో మధురలో వ్రేపల్లెలో ద్వారకా**
**పురిలో నాడెడు భంగి నాదుమదిలో భూరిప్రసన్నాననాం**
**బురుహం బొప్ప నటించుటొప్పును సితాంభోజాక్ష నారాయణా!** 59

**లఘు టీకా :** కాళింది = యమున; డోలికలలో = ఊయలలో; ధామంబులో = నిలయంలో; వెరవు + ఒప్పార = అనుకూలంగా; భూరి = గొప్ప; ప్రసన్న = మనోహరమైన; ఆనన = ముఖమనే; అంబురుహంబు = పద్మము; సిత + అంభోజ + అక్ష = తెల్లని పద్మములవంటి కన్నులు కలవాడా!

**భావం :** తెల్ల తామరలవంటి కన్నులు కల నారాయణా! యమునా తరంగాలలో, వైకుంఠలోకంలో, అయోధ్యలో, మధురలో, వ్రేపల్లెలో, ద్వారకలో ఆడినట్లుగానే నా మనస్సులో మనోహరమైన ముఖపద్మంతో ఆడడం నీకు తగినది.

**శా. చల్లల్వేఁటొకయూర నమ్ముకొను నాసం బోవుచోఁ ద్రోవ నీ**
**వుల్లాసంబున నడ్డకట్టి మదనోద్యోగానులాపంబులన్**
**జల్లన్ జల్లనిచూపు జల్లుమని గోపస్త్రీలపైఁ జల్లు మీ**
**చల్లంబోరు తెఱంగు జిత్తమున నే జర్చింతు నారాయణా!** 60

**లఘు టీకా :** ఉల్లాసంబునన్ = సంతోషంతో; అడ్డకట్టి = అడ్డుకొని; మదన + ఉద్యోగ + అనులాపంబులన్ = కామాన్ని ప్రేరేపించే మాటలను; చల్లన్ + పోరు తెరంగు = చల్లని యుద్ధం (ప్రణయ కలహం) తీరును; చర్చింతు = ధ్యానిస్తాను.

**భావం :** నారాయణా! గోపికలు పొరుగూరిలో చల్లలమ్ముకొనే కోరికతో పోతుండగా నీవు దారిలో అడ్డగించి, కామాన్ని ప్రేరేపించే మాటలతో, చల్లని చూపులను వారిపై చల్లుతూ ప్రణయ కలహాన్ని నిర్వహించిన పద్ధతిని నా మనస్సులో ధ్యానిస్తాను.

**మ. కలయన్వేదములున్ బురాణములు బ్రఖ్యాతంబుగా తెల్పి మీ**
**వలనన్ భక్తివిహీనుఁడైనపిదపన్ వ్యర్థప్రయత్నంబె పో**
**కులకాంతామణి గొడ్డువోయినగతిం గ్రొవ్వారు సస్యంబు దా**
**ఫలకాలంబున నీచపోవు పగిదిన్ పద్మాక్ష నారాయణా! 61**

**లఘు టీకా :** కలయన్ = కలసి కట్టుగా; క్రొవ్వారు = అతిశయించు; ఈచపోవు = శుష్కించు.

**భావం :** కమల నయనా! నారాయణా! కలిసి కట్టుగా వేదాలను, పురాణలను గొప్పగా చెప్పికూడా నీ పట్ల భక్తి లేనివాడైతే కులస్త్రీ గొడ్రాలైనట్లు, ఏపుగా పెరిగిన పైరు ఎండిపోయినట్లు అతని వేద పురాణ జ్ఞానం వ్యర్థమే కదా!

**శా. స్నానంబుల్ నదులందుఁ జేయుట గజస్నానంబు చందంబగున్**
**మౌనంబొప్ప జపించు వేద మటవీ మధ్యంబులో నేడ్పగున్**
**నానాహోమములెల్ల బూడిదలలోనన్ వేల్చు నెయ్యై చనున్**
**నీ నామోక్తియు నీపదాబ్జరతియున్ లేకున్న నారాయణా! 62**

**లఘు టీకా :** గజస్నానంబు = ఏనుగు నదిలో స్నానం చేసి ఒడ్డుకు చేరగానే తొండంతో దుమ్ము ధూళిని తనపై చల్లుకుంటుంది. దీనినే గజస్నాన న్యాయం అంటారు. ఏదైనా వ్యర్థప్రయత్నాన్ని గురించి చెప్పినప్పుడు ఈ న్యాయాన్ని పేర్కొంటారు.

**భావం :** నారాయణా! నీ నామస్మరణ, నీ పాదపద్మాలపై ఆసక్తి లేనప్పుడు నదులలో చేసే స్నానం గజస్నానం అవుతుంది. మౌనంగా జపించే

వేదమంత్రాలు నట్టడవిలో ఏడ్పు అవుతుంది. రకరకాలైన హోమాలన్నీ బూడిదలో వేల్చిన నెయ్యి అవుతుంది. అనగా నీ నామ స్మరణ, నీ పాద భక్తి లేకుండా చేసే స్నాన జప హోమాలు నిష్ప్రయోజనాలు అని భావం.

**మ. అల నీటం దగు రొంపిపైఁ జిలికినన్నానీట నేపాయు నా**
**యిల పాపంబులు దుర్భరత్వము మహాహేయంబునం బొందినం**
**బలువై జీవుని దొప్పదోఁగినవి యీ బాహ్యంబునం బాయునే**
**పొలియుంగాక భవత్సుపాదజలముం బ్రోక్షింప నారాయణా! 63**

**లఘు టీకా :** రొంపి = బురద; హేయంబునన్ = రోతగా; బలువై = బలిసి, ఎక్కువై; దొప్పఁదోగినవి = ముంచినవి; పొలియున్ = నశిస్తాయి; ప్రోక్షింప = చల్లినచో.

**భావం :** నారాయణా! నీటిలోని బురద మీద పడినప్పుడు ఆ బురదనీటితోనే కడిగితే పోతుందా? దుర్భరంగా బలిసి, శరీరం లోపల ఉన్న జీవుణ్ణి చెడగొట్టే మహాపాతకాలు నీ పాదతీర్థాన్ని చల్లితేనే నశిస్తాయి.

**మ. తన చిత్తాబ్జము మీపదాబ్జములకుం దాత్పర్య సద్భక్తితం**
**తున బంధించిన బంధనంబు కతనం దుష్పాపపుంజంబు లె**
**ల్లను విచ్ఛిన్నములై యడంగు మహిమోల్లాసాబ్ధియైనట్టి దా**
**సున కింపొందును మోక్షవైభవము దా సుశ్లోక నారాయణా! 64**

**లఘు టీకా :** చిత్త + అబ్జము = మనస్సనే పద్మము; తంతున = దారంతో; పుంజంబులు = రాశులు; విచ్ఛిన్నములు+ఐ = తెగిపోయి; అడంగు = నశిస్తాయి; సుశ్లోక = గొప్ప కీర్తి కలవాడా!

**భావం :** గొప్ప కీర్తి కలిగిన నారాయణా! తన మనస్సనే పద్మాన్ని నీ పాద పద్మాలతో భక్తి అనే దారంతో వేసిన ముడి వల్ల దాసుని పాపరాశులన్నీ తెగిపోయి నశిస్తాయి. ఆ మహిమ చేత ఆనంద సాగరంగా మారిన అతనికి మోక్ష వైభవం లభిస్తుంది.

**మ. తనువుం జీవుఁడు నేకమైన పిదపన్ ధర్మక్రియారంభుఁడై**
**యనయంబున్మది దన్నెఱుంగక తుదిన్మాయచే మగ్నుఁడై**
**తనుతత్వాది వియోగమైనపిదపం దానేర్చునే నీదు ద**
**ర్శన మింపారఁగ భక్తివైభవ మహాసంకాశ నారాయణా! 65**

**లఘు టీకా :** తనువు = శరీరం; అనయంబున్ = ఎల్లప్పుడు; మగ్నుఁడై = మునిగినవాడై; మహా + అసంకాశ = సాటి లేని గొప్పవాడా!

**భావం :** భక్తి అనే సంపదలో సాటిలేని గొప్పవాడవైన నారాయణా! శరీరం, ఆత్మ ఒక్కటైన తర్వాత ధర్మాచరణకు పూనుకొని ఎల్లప్పుడు తనను తాను తెలుసుకొనలేక చివరికి ఆ మాయలో మునిగిన జీవుడు దేహేంద్రియాలను విడిచిన తర్వాత నీ దర్శనం చేసుకోగలడా?

**మ. తనకున్ సాత్త్వికసంపదన్విత మహాదాసోహ భావంబున**
**న్ననయంబున్మది నన్యదైవభజనం బారంగ దూలింపుచున్**
**జనితాహ్లాదముతోడ నీ చరణముల్ సద్భక్తి పూజించి నిన్**
**గనుగొన్నంతనె కల్మషంబు లడఁగుం గర్మఘ్న నారాయణా! 66**

**లఘు టీకా :** సాత్త్విక = సత్త్వ గుణాలకు చెందిన; సంపత్ + అన్విత = సంపదలతో కూడిన; దాసోహభావంబునన్ = దాసుడననే భావంతో; ఆరంగ = పూర్తిగా; తూలింపుచున్ = తొలగిస్తూ; అడఁగున్ = నశిస్తాయి; కర్మఘ్న = కర్మలను నశింపజేసేవాడా!

**భావం :** కర్మలను నాశనం చేసే నారాయణా! సత్త్వగుణ సంపన్నమైన దాసోహమనే భావంతో సర్వదా అన్యదేవతలను భజించడాన్ని పూర్తిగా మానుకొంటూ సంతోషంగా నీ పాదాలను సద్భక్తితో పూజించగానే జీవునికి పాపాలు నశిస్తాయి.

**మ. పరికింపన్ హరిభక్తి భేషజునకున్ భవ్యంబుగా మీఁద మీ**
**చరణాంభోరుహ దర్శనంబు గలదే సంప్రీతి నెట్లన్నఁ దా**
**ధరలోఁ జోరుఁడు గన్న దుస్తర పరద్రవ్యంబుపై నాశలం**
**బొరయన్నేర్చునె దుర్లభంబగు గృపాంభోజాక్ష నారాయణా! 67**

**లఘు టీకా :** పరికింపన్ = ఆలోచించగా; భేషజునకున్ = డంబాచారము గలిగినవానికి; దుస్తర = దాటలేని; పొరయన్ = పొందగా.

**భావం :** దయతో కూడిన కమలాల వంటి కన్నులు కల నారాయణా! ఆలోచిస్తే హరిభక్తి అనే డంబాచారం కలిగినవానికి భవిష్యత్తులో నీ పాదపద్మాలను తృప్తిగా దర్శించే భాగ్యం ఉంటుందా? ఎలాగంటే పరుల

సంపదలను చూసినంత మాత్రాన దొంగకు అవి లభిస్తాయా? ఎన్నడూ లభింపవు.

**మ. పరమజ్ఞాన వివేక పూరిత మహాభవ్యాంతరాళంబునన్**
**పరగన్నీ నిజనామమంత్ర మొనరన్ భక్తిన్ననుష్ఠింపుచుం**
**దురితాన్వేషణ కాలభూతము వెసన్ దూలంగ వాకట్టు వాఁ**
**డరుగున్ భవ్యపదంబు నొందుటకునై యవ్యక్త నారాయణా! 68**

**లఘు టీకా :** భవ్య = యోగ్యమైన; అంతరాళంబునన్ = నడిమి ప్రదేశంలో (మనస్సులో); పరగన్ = ఉండేవిధంగా; ఒనరన్ = ఒప్పుగా; అనుష్ఠింపుచున్ = ఆచరిస్తూ; దురిత + అన్వేషణ = పాపాలను వెదకే; కాలభూతము = మృత్యువు; వెసన్ = వేగంగా; తూలంగ = తొలగగా; వాకట్టువాఁడు = వాగ్బంధనం చేసేవాడు; అవ్యక్త = కనిపించనివాడా!

**భావం :** అవ్యక్తుడవైన నారాయణా! గొప్ప జ్ఞానము, వివేకం కలిగిన మనస్సులో నీ నామమంత్రాన్ని భక్తితో జపిస్తూ పాపాలను వెదకే మృత్యువును తొలగిపోయే విధంగా వాగ్బంధనం చేసేవాడు పరమపదాన్ని పొందుతాడు.

**మ. సరి ఘోరాంధక బోధకారణ విపత్సంసార మాలిన్యమున్**
**పరమానంద సుబోధకారణ లసద్భస్మంబు పై నూఁది యా**
**నిరతజ్ఞానసుకాంతి దర్పణమునన్ నిస్సంగుఁడై తన్నుదా**
**నరయం గాంచిన వాఁడు నిన్నుఁ గనువాఁడబ్జాక్ష నారాయణా! 69**

**లఘు టీకా :** అంధక బోధ = చీకటి వంటి జ్ఞానం (అజ్ఞానం); విపత్ సంసార = ఆపదలతో కూడిన సంసారం యొక్క; లసత్ = ప్రకాశించే; నిరత = మిక్కిలి ఆసక్తి కలిగిన; నిస్సంగుడై = బంధాలు లేనివాడై; అబ్జ+అక్ష = కమలనయనా!

**భావం :** కమలనయనా! నారాయణా! అజ్ఞానం వల్ల కలిగే సంసార మాలిన్యాన్ని పరమానందాన్ని కలిగించే జ్ఞానంతో తొలగించుకొని బంధాలు తెంచుకొన్నవాడు అత్మ సాక్షాత్కారాన్ని పొందుతాడు. మలినమైన అద్దంమీద బూడిదను చల్లి తుడిచినవాడు తనను స్పష్టంగా చూసుకోగలడు. కర్మసంగ రహితుడైన జ్ఞాని ఆత్మ సాక్షాత్కారాన్ని, పరమాత్మ సాక్షాత్కారాన్ని పొందుతాడు.

**మ. పరుషాలాపములాడ నోడి మది నీపాపార్జనారంభుఁడై**
**నిరసించేరికిఁ గీడుసేయక మదిన్ నిర్ముక్త కర్ముండునై**
**పరమానంద నిషేధముల్ సమముగా భావించి వీక్షించునా**
**పరమజ్ఞాని భవత్కృపం బొరయ నో పద్మాక్ష నారాయణా!** ౭౦

**లఘు టీకా :** పరుష + ఆలాపములు = నిష్ఠురాలైన మాటలను; ఆడన్ = పలుకగా; ఓడి = విఫలమై; ఈ పాప + ఆర్జన + ఆరంభుఁడు + ఐ = పాపాలను సంపాదించే ఈ పనులను ప్రారంభించేవాడై; నిరసించి = తిరస్కరించి; ఏరికిన్ = ఎవరికి కూడా; నిర్ముక్త కర్ముండున్ + ఐ = ఫలాపేక్ష లేని కర్మల నాచరించేవాడై; నిషేధముల్ = ఆటంకాలు; పొరయున్ = పొందుతాడు.

**భావం :** ఓ కమలాక్షా! నారాయణా! నిష్ఠురంగా మాట్లాడకుండా, పాపకర్మలను చేయడాన్ని మానుకొని, ఎవరికీ కీడు చేయకుండా, కర్మలను వదలిపెట్టి, పరమానందాన్ని పొందడంలో కలిగే ఆటంకాలను సమానంగా చూచే గొప్ప జ్ఞాని మాత్రమే నీ దయను పొందుతాడు.

**మ. ఒరులం దన్ను నెఱుంగు నియ్యెఱుకయున్నొప్పార నేకాంతమం**
**దరయం బైపడు నన్యభామినులపై నాకాంక్షదూరత్వమున్**
**మరణావస్థను నీదు నామములె సన్మానంబునం దోఁచుటల్**
**ధరలోనన్నివి దుర్లభంబులు సుధాధామాక్ష నారాయణా!** ౭౧

**లఘు టీకా :** ఒరులన్ = పరులను; ఎఱుక = జ్ఞానం; ఒప్పారన్ = చక్కగా ఉండగా; పైపడు = మీద పడే; ఆకాంక్ష దూరత్వము = కోరిక లేకపోవడం; సన్మానంబునన్ = గౌరవంగా; తోఁచుటల్ = జ్ఞాపకం రావడం మొదలైనవి; సుధాధామ + అక్ష = చంద్రునివంటి చల్లని చూపులు కలవాడా!

**భావం :** చంద్రునివంటి చల్లని చూపులు కల నారాయణా! స్వపర భేదాన్ని తెలుసుకొనే జ్ఞానం, ఏకాంతంలో తనను వాంఛించిన స్త్రీలపై అనాసక్తి, అవసానకాలంలో మనస్సులో నీ నామస్మరణ చేయడం లోకంలో దుర్లభాలు.

**మ. వెరవొప్పన్ బహుశాస్త్రమంత్రము లొగిన్ వీక్షించి వేతెల్వి మీ**
**వరనామామృతపూర మానుచుఁ దగన్ వైరాగ్యభావంబునన్**
**సరి నశ్రాంతముఁ గోరువారు పిదపన్ సంసారమాతుఃపయో**
**ధరదుగ్ధంబులు గ్రోలనేరరు వెసన్ దైత్యారి నారాయణా!** ౭౨

**లఘు టీకా :** వెరవు + ఒప్పన్ = ఉపాయంగా; ఒగిన్ = క్రమంగా; వే తెల్పి = వేగంగా చెప్పి; అమృత పూరము = నిండుగా ఉన్న అమృతాన్ని; ఆనుచు = త్రాగుతూ; అశ్రాంతము = ఎల్లప్పుడు; మాతుః = తల్లియొక్క; పయోధర దుగ్ధంబులు = చనుబాలను; గ్రోల నేరరు = త్రాగలేరు.

**భావం :** రాక్షసవైరివైన నారాయణా! పెక్కు శాస్త్రాలను, మంత్రాలను చదివి, వివరించి, నీ నామామృతాన్ని పానం చేస్తూ, ఎల్లప్పుడూ వైరాగ్యభావాన్ని కోరేవారు ఆ తరువాత సంసారమనే తల్లిపాలను త్రాగరు. అంటే వారికి పునర్జన్మ ఉండదు.

**శా. వేదంబందు సునిశ్చయుండగు మహా వేల్పెవ్వఁడో యంచు నా**
**వేదవ్యాసపరాశరుల్ వెదకినన్ వేఱొండు లేఁడంచు మీ**
**పాదాంభోజము లెల్ల ప్రొద్దు మదిలో భావింతు రత్యున్నతిన్**
**శ్రీదేవీ వదనారవింద మధుపా శ్రీరంగ నారాయణా!** 73

**లఘు టీకా :** సునిశ్చయుండు = ప్రతిపాదింపబడినవాడు; మధుపా = తుమ్మెదా!

**భావం :** లక్ష్మీదేవి ముఖమనే పద్మానికి తుమ్మెద వైన శ్రీరంగనాయకా! నారాయణా! వేదవ్యాసుడు, పరాశరుడు మొదలైనవారు వేదాలు ప్రతిపాదించిన మహాదేవుడు ఎవరా అని వెదకి నీవు తప్ప మరొకడు లేడంటూ నీ పాదపద్మాలనే తమ మనస్సులలో గొప్పగా ధ్యానిస్తుంటారు.

**మ. సుతదారాప్తజనాది విత్తములపై శూన్యాభిలాషుండునై**
**యతనోద్రేకయుతంబులై పొదలునయ్యె యింద్రియవ్రాతముల్**
**మృతిఁ బొందించి దమంబునన్ శమమునన్ మీఱంగ వర్తించు ని**
**ర్గతసంసారి భవత్కృపం బొరయు నో కంజాక్ష నారాయణా!** 74

**లఘు టీకా :** దార = భార్య; శూన్య+అభిలాషుండు = కోరికలు లేనివాడు; యతన = ప్రయత్నం యొక్క; ఉద్రేక = అతిశయంతో; యుతంబులై = కూడినవై; పొదలు = వృద్ధిపొందే; వ్రాతముల్ = సమూహాలు; దమంబునన్ = నిగ్రహంతో; శమమునన్ = శాంతితో; నిర్గత సంసారి = సంసారబంధాల నుండి బయటపడినవాడు; పొరయున్ = పొందుతాడు.

**భావం** : కమలనయనా! నారాయణా! సంతానం, భార్య, మిత్రులు, ధనం పట్ల కోరికలు లేనివాడై, కోరికలు తీర్చుకొనడానికి ఎంతగానో ప్రయత్నించే ఇంద్రియాలను అణచివేసి, నిగ్రహంతో శాంతంతో ప్రవర్తిస్తూ సంసార బంధాలను వదలించుకొన్నవాడే నీ దయను పొందుతాడు.

**మ. ప్రమదం బారగఁ పుణ్యకాలగతులన్ భక్తిన్ననుష్ఠింపుచు**
**న్నమరన్నన్న సువర్ణ గో సలిల కన్యా ధారుణి గ్రామ దా**
**నము లామ్నాయవిధోక్తి భూసురులకున్ సన్మార్గుఁడై యిచ్చువాఁ**
**డమరేంద్రార్చిత వైభవోన్నతుఁడగున్నామీఁద నారాయణా! 75**

**లఘు టీకా :** ప్రమదంబు + ఆరగ = ఆనందంతో; పుణ్యకాలగతులన్ = పర్వదినాలలో; అనుష్ఠింపుచున్ = ఆచరిస్తూ; ఆమ్నాయ విధ + ఉక్తి = వేదాలలో చెప్పిన విధంగా.

**భావం** : నారాయణా! పర్వదినాలలో అన్నాన్ని, బంగారాన్ని, ఆవులను, నీళ్ళను, కన్యలను, భూములను, గ్రామాలను ఆనందంతో వేదోక్తంగా బ్రాహ్మణులకు దానమిచ్చేవాడు ఆ తరువాత దేవతలు, ఇంద్రుడు మెచ్చుకొనే గొప్ప వైభవాన్ని పొందుతాడు.

**మ. ఇల నెవ్వారి మనంబులో నెఱుకదా నెంతెంత గల్గుండు నా**
**కొలదిం జెంది వెలుంగుచుండు కలయన్ గోవింద నీరూపుల**
**న్నలర న్నంబుమితంబులై సరసిలో నంభోరుహంబుల్ దగన్**
**నిలనొప్పారెడు చంద మొందె దెపుడు న్నీలాంగ నారాయణా! 76**

**లఘు టీకా :** ఎఱుక = జ్ఞానం; అంబు మితంబులు = నీటికొలదికి పరిమితాలై; అంభోరుహంబుల్ = తామరలు; నీల + అంగ = నల్లని శరీరం కలవాడా!

**భావం** : నల్లని శరీరం కలిగిన గోవిందా! నారాయణా! సరస్సులో నీటి కొద్ది తామర లున్నట్లు ఈ లోకంలో ఎవరి మనస్సులో ఎంత జ్ఞానం ఉంటుందో అంత వరకే నీ రూపాలు వెలుగుతూ ఉంటాయి.

**మ. మదిలో నుత్తమభక్తి పీఠముపయిన్ మానాథ మీపాదముల్**
**గదియం జేర్చినవానికేనొడయఁడన్ గాదంచు సత్యున్నతిన్**

**పదిలుండై సమవర్తి మృత్యువునకున్ బాఠంబుగాఁ బల్కు మీ**
**పదపద్మార్చకు లెంతపుణ్యులో కృపాపారీణ నారాయణా!** ౭౭

**లఘు టీకా :** మానాథ = లక్ష్మికి భర్తవైనవాడా; కదియన్ = చేరువగా; ఒడయండన్ = ప్రభువును; సమవర్తి = యముడు; కృపాపారీణ = దయాగుణంలో తుద ముట్టినవాడా!

**భావం :** లక్ష్మీపతీ! దయాపూర్ణా! నారాయణా! తన మనస్సులో భక్తి అనే పీఠంపై మీ పాదాలను ప్రతిష్ఠించి కొలిచేవానికి తాను ప్రభువును కాదని యముడు మృత్యుదేవతకు బోధించాడంటే నీ పాదపూజ చేసేవారు ఎంత పుణ్యాత్ములో కదా!

**మ. కులమెన్నం గొలదేల యేకులజుఁడుం గోత్రాభి మానాభిలా**
**షలు నజ్ఞానము బాసి జ్ఞానము మదిన్ సంధించి శుద్ధాత్ముఁడై**
**యలరారం బరుసంబు సోఁకు నినుమున్ హేమాకృతస్తోమమై**
**వెలయున్నాగతి వాఁడు ముక్తి కరుగున్ వేదాత్మ నారాయణా!** ౭౮

**లఘు టీకా :** కొల = పాపం; గోత్ర = వంశాన్ని; అభిమాన = ఇష్టపడే; అభిలాషలు = కోరిక కలవారు; పరుసంబు = స్పర్శవేధి; సోఁకున్ = తాకినట్టి; హేమ + ఆకృత స్తోమము + ఐ = మొత్తం బంగారు రూపమై.

**భావం :** వేదాత్ముడైన నారాయణా! కులాన్ని లెక్కించే పాపం ఎందుకు? ఎవడైతే కులగోత్రాలను పరిగణించే అజ్ఞానాన్ని వదలి సుజ్ఞానంతో శుద్ధాత్ముడై ప్రకాశిస్తాడో అతడు స్పర్శవేధిని తాకిన ఇనుము బంగారమైనట్లు ముక్తిని పొందుతాడు.

**మ. నిరతానందనియోగులై నియతులై నిర్భాగ్యులై నీచులై**
**కరుణాహీనమనస్కులై మలినులై కష్టాత్ములై నష్టులై**
**పరుషవ్యాధినిబద్ధులై పతితులై భగ్నాంగులై మ్రగ్గువా**
**రరయన్నిన్నొగి నాత్మయుం దిడనివా రబ్జాక్ష నారాయణా!** ౭౯

**లఘు టీకా :** నిరత = ఎల్లప్పుడు; నియోగులై = నిమగ్నులై; నియతులై = నియమం కలవారై; పరుష = కఠినమైన; వ్యాధి నిబద్ధులై = రోగగ్రస్తులై; భగ్న + అంగులై = అవిటివారై; మ్రగ్గువారు = బాధపడేవారు.

**భావం** : కమలనయనా! నారాయణా! సదానంద భరితులై నియమబద్ధులై నిన్ను తమ మనస్సులో నిలుపుకొననివారు దురదృష్టవంతులై, నీచులై, దయలేనివారై, పాపులై, కష్టపడేవారై, అన్నీ పోగొట్టుకొన్నవారై, తీవ్రరోగ పీడితులై, పతితులై, అవిటివారై బాధపడతారు.

**మ. ఘనభోగాస్పదులై గతౌఘమతులై కారుణ్యులై ముక్తులై**
**ధనకీర్తిప్రదులై దయాభిరతులై ధర్మాత్ములై నిత్యులై**
**మనుజాధీశ్వరులై మనోజనిభులై మాన్యస్థులై స్వస్థులై**
**యొనరన్నొప్పెడువారు నీపదరుచి న్నూహించు నారాయణా! 80**

**లఘు టీకా :** ఘన = గొప్పనైన; భోగ = సుఖాలకు; ఆస్పదులై = స్థానభూతులై; గత = పోగొట్టుకొన్న; ఓఘ = పాపాలు కలిగిన; దయా + అభిరతులై = దయాసక్తులై; మనుజ + అధీశ్వరులై = రాజులై; మనోజ = మన్మథునితో; నిభులై = సమానులై; మాన్యస్థులై = మర్యాద గలవారై; స్వస్థులై = ఆరోగ్యవంతులై.

**భావం :** నారాయణా! నీ పాదకాంతులను మనస్సులో భావించేవారు గొప్పగా సుఖపడేవారై, పాపాలను పోగొట్టుకొన్నవారై, దయాత్ములై, ముక్తులై, ధనాన్నీ కీర్తినీ పంచేవారై, కరుణాసక్తులై, దర్మాత్ములై, శాశ్వతులై, రాజులై, మన్మథునితో సమానులై, గౌరవనీయులై, ఆరోగ్యం కలవారై, యోగ్యులై జీవిస్తారు.

**మ. విదితామ్నాయ నికాయభూతములలో విజ్ఞానసంపత్కళా**
**స్పదయోగీంద్ర మనస్సరోజములలో బ్రహ్మేంద్రదిక్పాలక**
**త్రిదశవ్రాతకిరీటరత్నములలో దీపించుచున్నట్టి మీ**
**పదపద్మంబులు భావగేహమున నే భావింతు నారాయణా! 81**

**లఘు టీకా :** ఆమ్నాయ = వేదాలు; నికాయ = నిలయంగా కల; భూతములలో = ప్రాణులలో; ఆస్పద = నెలవైన; మనః + సరోజములలో = మనస్సులనే పద్మాలలో; త్రిదశ = దేవతల యొక్క; వ్రాత = సమూహం యొక్క; దీపించుచున్నట్టి = ప్రకాశిస్తున్న; భావ గేహమున = మనస్సనే మందిరంలో.

**భావం :** నారాయణా! వేదాలకు నిలయాలైన ప్రాణులలో, జ్ఞానసంపద అనే కళలకు నిలయాలైన యోగీంద్రుల మనోపద్మాలలో, బ్రహ్మ ఇంద్రుడు

దిక్పాలకులు మొదలైన దేవతల కిరీట రత్నాలలో ప్రకాశించే నీ పాదపద్మాలను నా మనోమందిరంలో భావిస్తాను.

**మ. వెలయన్ యౌవనకాలమందు మరుఁడున్ వృద్ధప్యకాలంబునన్**
**బలురోగంబులు నంత్యమందు యముఁడుం బాధింప నట్లైన యీ**
**పలుజన్మంబులు చాల దూలితి ననుం బాలింపవే దేవ మీ**
**ఫలితానంద దయావలోకనము నాపైఁ జూపు నారాయణా! 82**

**లఘు టీకా :** వెలయన్ = ప్రకాశింపగా; మరుఁడు = మన్మథుడు; అంత్యము = మరణం; తూలితి = అనుభవించాను; అవలోకనము = దృష్టి.

**భావం :** నారాయణా! యౌవనంలో మన్మథుడు, వృద్ధాప్యంలో ఎన్నో రోగాలు, మరణకాలంలో యముడు బాధిస్తుండగా ఇటువంటి ఎన్నో జన్మలెత్తి అనుభవించాను. నన్ను పాలించు. బ్రహ్మానందాన్ని కలిగించే నీ కరుణాదృష్టిని నాపై ప్రసరించు.

**మ. బలుకర్మాయత పాశబంధవితతిన్ బాహాపరిశ్రేణికిన్**
**జలయంత్రాన్వితబంధయాతనగతిన్ సంసారకూపంబులో**
**నలరం ద్రిమ్మరుచుండు నన్ను నకటా! యార్తుండనై వేఁడెదన్**
**వెలయన్నీకృపచేతఁ జేకొనవె నన్ వేవేగ నారాయణా! 83**

**లఘు టీకా :** బలు = మిక్కిలి; ఆయత = పొడవైన; పాశబంధ = త్రాళ్ళతో కట్టిన ముడుల; వితతిన్ = సమూహాన్ని; బాహా = బాహువులనెడి; పరిశ్రేణికిన్ = బొక్కెనకు; జలయంత్ర = నీటిమరతో; అన్విత = కూడిన; బంధ యాతన = బంధనాల బాధ; గతిన్ = వలె; ఆర్తుండనై = బాధపడుతున్నవాడనై; చేకొనవె = ఆదరించవా.

**భావం :** నారాయణా! త్రాటితో బొక్కెనలను వరుసగా కట్టి వాటిని జలయంత్రంతో అమర్చగా అవి తిరుగుతున్నట్లు అనేక కర్మపాశాలతో కట్టబడి సంసారమనే బావిలో తిరుగుతున్న నేను నిన్ను ఆర్తితో వేడుకుంటున్నాను. నన్ను దయతో ఆదరించు.

**మ. మమహంకారవికారసన్నిభ మహామత్తాది లోభాంధకా**
**రముచే ముక్తికి నేఁగుమార్గ మెఱుగన్ రాదింక నాలోన నీ**

**విమలాపాంగదయాదివాకరరుచిన్ వెల్గింపు మింపార నో**
**కమలానంద విహారవక్షలలితా! కంజాక్ష నారాయణా! 84**

**లఘు టీకా :** మమ = మమకార మనెడి; హంకార = అహంకార మనెడి; వికార = తెగులుతో; సన్నిభ = సమానమైన; మహా మత్త + ఆది = గొప్ప మదం మొదలైన; లోభ = కోరికలనెడి; విమల = పరిశుద్ధమైన; అపాంగ = కడకంటిలోని; దయా దివాకర రుచిన్ = దయ అనే సూర్యకాంతిని; ఇంపారన్ = సంతోషించగా; కమలా = లక్ష్మీదేవి; ఆనంద = సంతోషంగా; విహార = విహరించే; వక్ష = వక్షఃస్థలం చేత; లలితా = అందమైనవాడా!; కంజ + అక్ష = పద్మములవంటి కన్నులు కలవాడా!

**భావం :** లక్ష్మీదేవి ఆనందంతో విహరించే వక్షఃస్థలంతో శోభించేవాడా! కమలనయనా! నారాయణా! మమకారం, అహంకారాలు అనబడే వికారాలతో సమానమైన మద మాత్సర్యాలనే అంధకారం చేత ముక్తిని చేరే మార్గం తెలియరాదు. నీ కటాక్షం నుండి దయ అనే సూర్యకాంతిని నాలో ప్రకాశింప చేయవలసింది.

**మ. పరిపంథిక్రియ నొత్తి వెంటఁబడు నప్పాపంబుఁ దూలించి మీ**
**చరణాబ్జస్థితిపంజరంబు శరణేచ్ఛం జొచ్చితిం గావుమీ**
**బిరుదుం జూడుము మీరు సూడఁగ భవద్భృత్యుండు దుఃఖంబులం**
**బొరయన్ మీకపకీర్తిగాదె శరదంభోజాక్ష నారాయణా! 85**

**లఘు టీకా :** పరిపంథి క్రియన్ = శత్రువులాగా; ఒత్తి = నెట్టి; తూలించి = తొలగించి; చరణ + అబ్జ = పాద పద్మాలనే; స్థితి = స్థిరమైన; శరణ + ఇచ్ఛన్ = రక్షణ పొందాలనే కోరికతో; బిరుదున్ = శరణాగతులను రక్షిస్తావనే నీ పేరును; పొరయన్ = పొందడం; శరత్ + అంభోజ + అక్ష = శరత్కాలమందలి కమలాల వంటి కన్నులు కలవాడా!

**భావం :** శరత్కాలంలోని తామరల వంటి కన్నులు కలిగిన నారాయణా! శత్రువులాగా వెంటబడే పాపాన్ని తొలగించి నీ పాదపద్మాలనబడే స్థిరమైన పంజరాన్ని ఆశ్రయించిన నన్ను కాపాడు. శరణాగత రక్షకుడవన్న నీ పేరును గుర్తుకు తెచ్చుకో. నీ సేవకుడు దుఃఖాన్ని పొందడం నీకు అపకీర్తి కాదా?

**మ. సతతాచారము సూనృతంబు కృపయున్ సత్యంబునున్ శీలము**
**న్నతి శాంతత్వము చిత్తశుద్ధి కరమున్నధ్యాత్మయున్ ధ్యానమున్**
**ధృతియున్ ధర్మము సర్వజీవహితముం దూరంబు గాకుండ స**
**మ్మతికిం జేరువ మీ నివాససుఖమున్ మానాథ నారాయణా! 86**

**లఘు టీకా :** సతత = నిత్యమైన; సూనృతంబు = సత్యవాక్కు; నతి = నమ్రత; చిత్త శుద్ధి కరమున్ = మనస్సును నిర్మలంగా ఉంచుకొనడం; అధ్యాత్మ = ఆత్మజ్ఞానం; ధృతి = ధైర్యం; సమ్మతికిన్ = ప్రజ్ఞావంతునికి; మానాథ = లక్ష్మీపతీ!

**భావం :** లక్ష్మీపతివైన నారాయణా! ఎల్లప్పుడు సదాచారాన్ని పాటించడం, సత్యాన్ని పలుకడం, దయ కలిగి ఉండడం, యథార్థాన్ని గ్రహించడం, చక్కని నడవడి, నమ్రత, శాంతం, చిత్తశుద్ధినిచ్చే ఆత్మజ్ఞానం, ధ్యానం, ధైర్యం, ధర్మాచరణం, సర్వ జీవులకు మేలు చేయడం మొదలైన వాటిని వదలకుండా ఉండే ప్రజ్ఞావంతునికి నీ సన్నిధి అతి సమీపంలో ఉంటుంది.

**మ. భవనాశిన్ గయ తుంగభద్ర యమునన్ భాగీరథిం గృష్ణ వే**
**త్రవతిన్ నర్మద పెన్న గౌతమి పయోరాశిన్ వియద్గంగయం**
**దవగాహంబున నైన పుణ్యములు బెంపారంగ నేఁ డిచ్చటన్**
**భవదంఘ్రి స్మరణంబునం గలుగు నో పద్మాక్ష నారాయణా! 87**

**లఘు టీకా :** భాగీరథి = గంగ; గౌతమి = గోదావరి; పయోరాశి = సముద్రం; వియత్ + గంగ = ఆకాశగంగ; అవగాహంబున = స్నానంతో; పెంపు + ఆరంగ = వృద్ధి పొందగా; భవత్ + అంఘ్రి = నీ పాదాల.

**భావం :** భవనాశి, గయ, తుంగభద్ర, యమున, గంగ, కృష్ణవేణి, వేత్రవతి, నర్మద, పెన్న, గోదావరి, సముద్రం మొదలైన వాటిలో స్నానం చేస్తే వచ్చే పుణ్యాలు నే డిక్కడ నీ పాదాలను స్మరించినంత మాత్రాన లభిస్తాయి కదా!

**మ. ధర గ్రామాధిపు నింటిదాసుఁడు వెసం దా ద్రోహముం జేసినన్**
**పరగం జెల్లుట సూచి తీ భువన సంపాద్యుండ వైనట్టి మీ**
**వరదాసావళి దాసదాసినని దుర్వారౌఘముల్ జేసితిన్**
**కరుణం జేకొని కావుమయ్య త్రిజగత్కల్యాణ నారాయణా! 88**

**లఘు టీకా :** గ్రామ + అధిపు = గ్రామాధికారి యొక్క; వెసన్ = త్వరగా; పరగన్ = ప్రసిద్ధంగా; చెల్లుట = చెల్లుబాటు కావడం; భువన = లోకాలను; సంపాద్యుండవు = కల్పించినవాడవు; దాస + ఆవళి = దాసుల సమూహం యొక్క; దుర్వార = అడ్డులేని; అఘముల్ = పాపాలను.

**భావం :** ముల్లోకాలకు మేలు కూర్చే నారాయణా! లోకంలో గ్రామాధికారి ఇంటి సేవకుడు ద్రోహం చేసినా చెల్లుబాటు కావడం చూచినాను. లోకాలను సృష్టించిన నీ దాసుల సమూహానికి దాసుడైనవాని దాసుడ ననుకొంటూ అడ్డులేకుండా పాపాలు చేశాను. నన్ను దయతో కాపాడు.

**మ. గణుతింపన్ బహుధర్మశాస్త్ర నిగమౌఘుం బెప్పుడున్ ని న్నకా**
**రణబంధుండని చెప్ప నత్తెఱఁగు దూరం బందకుండంగనే**
**బ్రణతుల్ జేసెదఁ గొంతయైన గణుతింపం బాడి లేకుండినన్**
**ఋణమా నానుతి నీవు శ్రీపతివి నీకేలప్పు ? నారాయణా! 89**

**లఘు టీకా :** గణుతింపన్ = పరిశీలించగా; నిగమ = వేదాల; ఓఘంబు = సమూహం; అకారణ బంధుండు + అని = కారణం లేని చుట్టానివి అని; ఆ + తెఱఁగు = ఆ పద్ధతిని; దూరంబు + అందకుండగనే = అంతు చూడకుండానే; పాడి = న్యాయం; నుతి = స్తోత్రం.

**భావం :** నారాయణా! పెక్కు ధర్మశాస్త్రాలు, వేదాలు నిన్ను అకారణ బంధువని చెప్తాయి. నేను వాటి అంతు చూడకుండానే నీకు దండాలు పెడతాను. నీవు కొంచెమైనా నన్ను లెక్కలోనికి తీసికొనడం న్యాయం. లేకుంటే నా స్తోత్రం నీకు ఋణమనుకొంటే లక్ష్మీపతివైన నీకు అప్పెక్కడిది?

**మ. కరినాథుండు జలగ్రహగ్రహణ దుఃఖాక్రాంతుఁడై యీశ మీ**
**శరణంబన్నఁ గృశానుభాను శతతేజస్ఫూర్తియైనట్టి మీ**
**కరచక్రంబున నక్రకంఠము వెసన్ ఖండించి మించెం దయా**
**పరసద్భక్త భయానకప్రకర సత్ప్రాకట్య నారాయణా! 90**

**లఘు టీకా :** కరినాథుండు = గజేంద్రుడు; జలగ్రహ = మొసలిచే; గ్రహణ = పట్టుబడి; దుఃఖ + ఆక్రాంతుడై = దుఃఖపడినవాడై; కృశాను = అగ్నియొక్క; భాను శత = నూరు సూర్యుల యొక్క; స్ఫూర్తి = తేజస్సు కలినది;

నక్ర = మొసలి యొక్క; వెసన్ = వేగంగా; దయాపర = దయామయా!; భయానక = భయాన్ని కలిగించే; ప్రకర = సమూహం కలిగినవారికి; సత్ ప్రాకట్య = చక్కగా ఉనికిని ప్రకటించేవాడా!

**భావం :** దయామయా! భక్తులకు ఆపదలు కలిగినప్పుడు ఉనికి ప్రకటించే నారాయణా! గజేంద్రుడు మొసలికి పట్టుబడి దుఃఖించి "దేవా! నీవే శరణం" అనగానే అగ్నిలాగా, నూరు సూర్యులలాగా ప్రకాశిమ్చే నీ చేతి చక్రంతో ఆ మొసలి కంఠాన్ని ఖండించి రక్షించావు.

**శా. ఏభావంబున నిన్ దలంచె గజయూథేంద్రుండు నాపన్నుఁడై**
**యేభావంబున ద్రౌపదయ్యెడ రమాధీశా యనె న్వాయసం**
**బేభావంబున నీశరణ్య మనెనో యీ నీకృపాదృష్టిచే**
**నాభావంబున నీతలంపుఁ గలుగ న్నాకిమ్ము నారాయణా! 91**

**లఘు టీకా :** గజయూథ + ఇంద్రుడు = ఏనుగుల సమూహానికి అధిపతి; ఆపన్నుడై = ఆపద పొందినవాడై; ఆ + ఎడ = అక్కడ (ఆ కౌరవసభలో); రమా + అధీశా = లక్ష్మీపతీ!; వాయసంబు = కాకి (కాకాసురుడు); శరణ్యము = రక్షించు; తలంపు = ఆలోచన.

**భావం :** నారాయణా! ఏ భావంతో ఆపదలో ఉన్న గజేంద్రుడు నిన్ను తలచుకొన్నాడో, ఏ భావంతో ద్రౌపది కౌరవసభలో "శ్రీపతీ" అని పిలిచిందో, కాకాసురుడు ఏ భావంతో నిన్ను శరణు కోరాడో ఆ భావంతో నిన్ను తలచుకొనే బుద్ధిని దయతో నా కివ్వు.

**శా. నీలగ్రీవుఁడు చేతిపున్క విడిచె న్నీయింతి భిక్షంబునన్**
**నీలగ్రీవుఁడె యీశ్వరాఖ్యఁ దనరెన్ నీనామజప్యంబునన్**
**నీలగ్రీవుఁడు మించి త్రుంచెఁ బురముల్ నీ ప్రాపు సేవించినన్**
**నీలగ్రీవమఖాబ్జభాస్కర కృపానిత్యాత్మ నారాయణా! 92**

**లఘు టీకా :** నీలగ్రీవుడు = నల్లని కంఠం కలిగిన శివుడు; చేతి పున్క = చేతికంటిన కపాలాన్ని; ఆఖ్యన్ = పేరుతో; తనరెన్ = ప్రసిద్ధిని పొందాడు; ప్రాపు = ఆశ్రయంలో.

**భావం :** శివుని ముఖపద్మానికి సూర్యుని వంటివాడా! శాశ్వతమైన దయాస్వరూపం కలిగిన నారాయణా! శివుడు తన చేతికి అంటుకొన్న బ్రహ్మ కపాలాన్ని నీ భార్య లక్ష్మి పెట్టిన భిక్షతో వదిలించుకున్నాడు. నీ నామాన్ని జపించి ఈశ్వరుడన్న పేరుని పొందగలిగాడు. నిన్ను ఆశ్రయించి సేవించడం వలన పరాక్రమిమ్చి త్రిపురాలను జయించాడు.

**మ. నిను వర్ణింపనివాఁడు మూఁగ, మదిలో నీనామమున్ వీనులన్**
**విని మోదింపనివాఁడు చెవ్డు, మరి నిన్ వేడ్కన్ మనోవీధినిన్**
**గని పూజింపనివాఁడు నాశకరుఁడౌ, కర్మక్రియారంభుఁడై**
**తనలోఁ గాననివాఁడు నీచమతివో తత్త్వజ్ఞ నారాయణా! 93**

**లఘు టీకా :** మోదింపనివాఁడు = ఆనందింపనివాడు; చెవ్డు = చెవిటివాడు; మనోవీథినిన్ = హృదయంలో; నాశకరుఁడు = తనకు ఇతరులకు నాశనం కలిగించేవాడు; కర్మక్రియా + ఆరంభుడై = కర్మలకు చెందిన పనులను మొదలుపెట్టినవాడై; నీచమతి = నీచబుద్ధి కలవాడు; తత్త్వజ్ఞ = విశ్వ రహస్యం తెలిసినవాడా!

**భావం :** విశ్వరహస్యం తెలిసిన నారాయణా! నిన్ను వర్ణింపని వాడు మూగవాడు. నీ పేరును విని సంతోషింపనివాడు చెవిటివాడు. నిన్ను మనస్సులో దర్శిస్తూ పూజింపనివాడు ఆత్మ పర నాశకుడు. కార్యాలను చేయ మొదలుపెట్టి తనలో నిన్ను చూడనివాడు నీచుడు.

**మ. నిను వర్ణింపని నీచబంధమతి దా నిర్మగ్నమూఢాత్ముఁడై**
**పెను దైవంబులఁ గోరి తా మనమునన్ సేవించు చందంబు తా**
**ననలం బారిన భూతియందు వెలయన్నాజ్యాహుతుల్ పూని వే**
**ల్చిన చందంబున వ్యర్థమై తనరుఁ జూ చిద్రూప నారాయణా! 94**

**లఘు టీకా :** నీచబంధమతి = మందమతి; నిర్మగ్న మూఢ + ఆత్ముఁడై = అజ్ఞానంలో మునిగిన ఆత్మ కలవాడై; పెను = పెక్కు; అనలంబు = అగ్ని; భూతి = బూడిద; వెలయన్ = ప్రకాశించే విధంగా; ఆజ్య + ఆహుతుల్ = నేతి ధారలను; పూని = ప్రయత్నించి; వేల్చిన = హోమం చేసిన; చూ = చూడు; చిత్ + రూప = జ్ఞానమే రూపంగా కలవాడా!

**భావం :** జ్ఞానరూపివైన నారాయణా! నిన్ను వర్ణించని మందమతి మూఢత్వంలో మునిగి ఇతర దేవతలను కోరి కోరి వ్యర్థంగా సేవిస్తాడు. ఇది ఎలా ఉందంటే... అగ్ని ఆరిపోయిన తర్వాత ఆ బూడిదలో నెయ్యి పోసి వెలిగించి హోమం చేస్తే అది వ్యర్థమే అవుతుంది కదా!

**మ. నిను వర్ణింపని జిహ్వ దాఁ బదటికా నీలాభ్రదేహాంగకా!**
**నిను నాలింపని చెవ్లు దాఁ బదటికా నీరేజపత్రేక్షణా!**
**నినుఁ బూజింపని కేలు దాఁ బదటికా ? నిర్వాహకక్ష్మాతలా!**
**నినుఁ జింతింపని యాత్మ దాఁ బదటికా నిర్వాణ నారాయణా! ౯౫**

**లఘు టీకా :** పదటి కా ('పదడు' శబ్దం ఔపవిభక్తికమైన టి చేరి 'పదటి' అయింది. పదడు అంటే బూడిద.) = బూడిద కదా (వ్యర్థం కదా); నీల + అభ్ర = నల్లని మేఘం వంటి; దేహ + అంగకా = దేహావయవాలు కలవాడా!; ఆలింపని = వినని; నీరేజ పత్ర = తామర రేకుల వంటి; ఈక్షణా = కన్నులు కలవాడా!; కేలు = చేయి; నిర్వాహక క్ష్మాతలా = భూతలాన్ని నిర్వహించేవాడా!; నిర్వాణ = మోక్షము నిచ్చేవాడా!

**భావం :** నీలమేఘ శరీరా! పద్మదళనేత్రా! భూతల నిర్వాహకా! మోక్షప్రదాతా! నారాయణా! నిన్ను వర్ణింపని నాలుక, నీ గురించి వినని చెవులు, నీ పూజ చేయని చేయి, నిన్ను స్మరింపని మనస్సు బూడిదలాగా వ్యర్థమైనవి.

**శా. నీవే తల్లివి నీవె తండ్రి వరయన్ నీవే జగన్నాధుఁడౌ**
**నీవే నిశ్చల బాంధవుండ వరయన్ నీవే మునిస్తుత్యుఁడౌ**
**నీవే శంకరమూలమంత్ర మరయన్ నీవే జగత్కర్తవున్**
**నీవే దిక్కను వారి వారలె కడున్ నీవారు నారాయణా! ౯౬**

**లఘు టీకా :** అరయన్ = ఆలోచిస్తే; జగత్ + నాథుడౌ = జగాలకు ప్రభుడవు; నిశ్చల = స్థిరమైన; ముని స్తుత్యుడౌ = మునులచేత పొగడబడేవాడవు.

**భావం :** నారాయణా! ఆలోచించి చూస్తే నీవే తల్లివి. నీవే తండ్రివి. నీవే లోకనాథుడవు. నీవే ఆత్మీయుడవైన చుట్టానివి. మునులచేత పొగడబడేవాడవు నీవే. నీవే శంకరుడు జపించే మూలమంత్రానివి. నీవే

లోకాలను సృష్టించిన వాడవు. నీవే దిక్కని పలికేవారు, వారికి చెందినవారే నీవారు కదా!

**మ. అపరాధంబులు నిన్ను నమ్మి విను మే నాజన్మపర్యంతమున్**
**విపరీతంబుగఁ జేసినాఁడ నిఁక నీవే దిక్కు నాలోనికిన్**
**గపటం బింతయులేక దండధరుకుం గట్టీక రక్షింపు మీ**
**కృపకుం బాత్రుఁడనయ్య ధర్మపురి లక్ష్మీనాథ నారాయణా!** ౯౭

**లఘు టీకా** : ఆజన్మ పర్యంతమున్ = పుట్టినప్పటి నుండి; దండధరుకున్ = యమునకు; కట్టి + ఈక = బంధించనీయక.

**భావం** : ధర్మపురి క్షేత్రంలో వెలసిన లక్ష్మీనాథుడవైన నారాయణా! నీవు రక్షిస్తావని నిన్ను నమ్మి పుట్టినప్పటినుండి విపరీతంగా ఎన్నో తప్పులు చేశాను. నాకు ఇక నీవే దిక్కు. నాలో కపటత్వాన్ని పారద్రోలి, నన్ను యమునకు దొరకకుండా రక్షించు. నేను నీ దయకు తగినవాడనే కదా!

**శా. చెల్లంజేసితి పాతకంబులు మదిన్ శ్రీనాథ! మీనామముల్**
**పొల్లుల్ బోవని నమ్మి పద్యశతమున్ బూర్ణంబుగాఁ జెప్పితిన్**
**చెల్లంబో నను నమ్మె వీఁడని దయం జేపట్టి రక్షింపుమీ**
**తల్లిం దండ్రియు నీవుగాక యొరులో తర్కింప నారాయణా!** ౯౮

**లఘు టీకా** : చెల్లన్ + చేసితి = చెల్లిపోయేటట్లు చేశాను; పాతకంబులు = పాపాలు; పొల్లుల్ + పోవు + అని = వ్యర్థం కావని; చెల్లన్ + పో = చెల్లనిమ్ము గాక; తర్కింప = విచారింపగా.

**భావం** : శ్రీపతీ! నారాయణా! పాప ఫలాలను అనుభవించాను. నీ నామాలు వ్యర్థం కావని భావించి వంద పద్యాలను (శతకాన్ని) పూర్తిగా చెప్పాను. అది అలా ఉండనీ. వీడు నన్ను నమ్మాడు కదా అని భావించి దయతో నన్ను చేపట్టి రక్షించు. విచారిస్తే నాకు తల్లి దండ్రులు నీవు కాక వేరెవరున్నారు?

**మ. నరసింహాచ్యుత! వాసుదేవ! వికసన్నాళీకపత్రాక్ష! భూ**
**ధర! గోవింద! ముకుంద! కేశవ! జగత్త్రాతాహితల్పాంబుజో**
**దర! దామోదర! తార్క్ష్యవాహన! మహాదైత్యారి! వైకుంఠమం**
**దిర! పీతాంబర! భక్తవత్సల! కృపన్ దీపింపు నారాయణా!** ౯౯

**లఘు టీకా :** వికసత్ = వికసించిన; నాళీక పత్ర = తామర రేకుల వంటి; అక్ష = కన్నులు కలవాడా!; జగత్ + త్రాత = లోకరక్షకా!; అహి తల్ప = శేషశయనా!; అంబుజ + ఉదర = పద్మనాభా!; తార్క్ష్య వాహన = గరుడవాహనా!; దైత్య + అరి = రాక్షసవైరీ!

**భావం :** నరసింహా! (సగం మానవరూపంలో, సగం సింహరూపంలో ప్రకటమై దుష్టశిక్షణ చేసినవాడు); అచ్యుతా! (తాను జారక, తన భక్తులను జారవిడువనివాడు); వాసుదేవా! (అంతటా వసించి, తనలో అన్నింటినీ వసింపజేసేవాడు); వికసించిన కమలాల వంటి కన్నులు కలవాడా! భూధరా! (భూమిని ధరించిన వరాహమూర్తి); గోవిందా! (స్తోత్రవాక్కులను పొందేవాడు); ముకుందా! (ముక్తినీ, భక్తినీ ఇచ్చేవాడు); కేశవా! (చంద్ర సూర్య కిరణాలే కేశాలుగా కలవాడు); లోకరక్షకా! శేషతల్పా! పద్మనాభా! దామోదరా! (ఇంద్రియ నిగ్రహం కలవాడు); గరుడవాహనా! రాక్షసవైరీ! వైకుంఠనిలయా! పీతాంబరా! భక్తవత్సలా! నారాయణా! నన్ను దయతో దీవించు.

**మ. కడకంటం గడలేని సంపదలొగిం గావింపు లక్ష్మీశపా**
**ల్కడలిన్ బన్నగశాయివై భువనముల్ గల్పించు సత్పుత్రినిన్**
**బొడమన్ జేసిన నాభిపంకజ జగత్పుణ్యాత్మ భాగీరథీ**
**పడతిం గన్న పదార విందముల నే భావింతు నారాయణా! 100**

**లఘు టీకా :** కడలేని = అంతులేని; ఒగిన్ = క్రమంగా; పొడమన్ + చేసిన = పుట్టించిన; నాభి పంకజ = బొడ్డు తామర కలవాడా!

**భావం :** నారాయణా! లక్ష్మీపతివి కనుక నీ కటాక్షంతో అంతులేని సంపదలను కల్పించు. పాలసముద్రంపై శేషశాయివై లోకాలను సృష్టించే బ్రహ్మను పుట్టించిన బొడ్డు తామర కలవాడా! లోకపావని అయిన గంగను పుట్టించిన నీ పాదపద్మాలను నేను స్మరిస్తాను.

**మ. తపముల్ మంత్రసమస్త యజ్ఞఫలముల్ దానక్రియారంభముల్**
**జపముల్ పుణ్యసుతీర్థసేవ ఫలముల్ సద్వేదవిజ్ఞానముల్**

**ఉపవాసవ్రత శీలకర్మ ఫలముల్ ఒప్పార నిన్నాత్మలో**
**నుపమింపం గలవారికే గలుగు వేయున్నేల నారాయణా! 101**

**లఘు టీకా :** ఉపమింపన్ + కలవారికే = పోల్చగలవారికే.

**భావం :** నారాయణా! తపస్సుల, మంత్రాల, సమస్త యజ్ఞాల, దానకర్మల, జపాల, పుణ్యతీర్థ సేవనల, వేద విజ్ఞానాన్ని పొందడం, ఉపవాసాల, వ్రతాల, సత్ప్రవర్తనల ఫలితాలన్నీ నిన్ను మనస్సులో స్మరించినంత మాత్రాన లభిస్తాయి. వేయి మాటలెందుకు?

**శా. శ్రీనారాయణ! యన్నఁ జాలు దురితశ్రేణిన్నివారింపఁగా**
**నానందస్థితి గల్గునంచు నిగమార్థానేక మెల్లప్పుడున్**
**నానాభంగులఁ జెప్ప నేను విని శ్రీనారాయణా! యంచు ని**
**న్నేనేనెప్పుడు గొల్తు బ్రోవఁగదె తండ్రీ నన్ను నారాయణా! 102**

**లఘు టీకా :** దురిత శ్రేణిన్ = పాపసమూహాన్ని; నిగమ + అర్థ + అనేకము = వేదార్థాల బాహుళ్యం.

**భావం :** నారాయణా! "శ్రీ నారాయణా!" అంటే చాలు పాపాలన్నీ తొలగిపోయి బ్రహ్మానంద స్థితి కలుగుతుందని వేదార్థాలన్నీ రకరకాలుగా చెప్పగా విని నేను నిన్ను "శ్రీ నారాయణా!" అంటూ సేవిస్తాను. తండ్రీ! నన్ను కాపాడవలసింది.

**మ. కలితాఘౌఘ వినాశకారి యగుచుం గైవల్య సంధాయియై**
**నలి నొప్పారెడు మంత్రరాజ మగు నీనామంబు ప్రేమంబున**
**న్నలరన్నెవ్వని వాక్కునం బొరయదో యన్నీచుదేహంబు దా**
**వెలయన్ భూరుహకోటరం బదియ సూ వేదాత్మ నారాయణా! 103**

**లఘు టీకా :** కలిత = కూడిన; అఘ + ఓఘ = పాపరాశిని; వినాశకారి = నాశనం చేసేది; కైవల్య = మోక్షాన్ని; సంధాయియై = సమకూర్చేదై; నలిన్ = మిక్కిలి; ఒప్పు + ఆరు = యోగ్యంగా ఉండే; పొరయదో = ఉండదో; భూరుహ కోటరంబు = చెట్టుతొఱ్ఱ.

**భావం** : వేదమూర్తివైన నారాయణా! సంచిత పాపాల నన్నింటినీ నాశనం చేసేదై, మోక్షాన్ని సమకూర్చేదై విలసిల్లే నీ నామాన్ని పలుకనట్టి నీచుని దేహం చెట్టుతొఱ్ఱ వంటిది కదా!

**మ. రమణీయంబుగ నాదిమంబు నవతారంబున్ భవద్దివ్యరూ**
**పము నామామృతమున్ దలంప దశకప్రాప్తయ్యెఁ గృష్ణావతా**
**రము సుజ్ఞానము మోక్షమున్ ద్వివిధసంప్రాప్తిన్ శతాంధ్రాఖ్యకా**
**వ్యము నర్పించితి మీ పదాబ్జములకున్ వైకుంఠ నారాయణా! 104**

**లఘు టీకా :** రమణీయంబుగ = అందంగా; ఆదిమంబు = మొదట; దశకప్రాప్తి = పది పద్యాలను పొందడం; ద్వివిధ సంప్రాప్తిన్ = పదికి రెట్టింపుతో; శత + ఆంధ్ర + ఆఖ్య కావ్యము = నూరు తెలుగు పద్యాల కావ్యాన్ని (శతకాన్ని).

**భావం** : వైకుంఠవాసా! నారాయణా! అవతార దశకంతో మొదలుపెట్టి, నీ దివ్యరూప దశకం, నామ ప్రభావ దశకం అనే నాలుగు విషయాలు పదేసి పద్యాలతో అందంగా సమకూరాయి. తరువాత కృష్ణావతార వింశతి (20), జ్ఞానవింశతి (20), మోక్షవింశతి (20) అనే ఈ మూడు విషయాలతో కూడి ఆంధ్రభాషలో నూరు పద్యాలు రచింపబడ్డాయి. ఈ శతక కావ్యాన్ని నీ పాదపద్మాలకు సమర్పించాను.

**శా. నీమూర్తుల్ గన నీకథల్ వినఁ దుదిన్ నీపాదనిర్మాల్య ని**
**ష్ఠామోదంబు నెఱుంగ, నీచరణతోయంబాడ, నైవేద్యముల్**
**నీమంబొప్ప భుజింప నీజపము వర్ణింపన్ గృపం జేయవే**
**శ్రీమించన్ బహుజన్మజన్మములకున్ శ్రీయాది నారాయణా! 105**

**లఘు టీకా :** మూర్తుల్ = రూపాలను; కనన్ = చూడడానికి; తుదిన్ = చివరకు; పాద నిర్మాల్య = పాదపూజ చేసి తీసివేసిన పూజాద్రవ్యాలలో; నిష్ఠ = ఉన్నటువంటి; ఆమోదంబు = వాసనను; చరణతోయంబు = పాదాలు కడిగిన నీటిని; ఆడన్ = స్వీకరించడానికి; నీమంబు = నియమం.

**భావం** : శ్రీ ఆది నారాయణా! నాకు జన్మజన్మలకు కూడా నీ రూపాలను చూడడానికి, నీ కథలను వినడానికి, నీ పాదపూజ చేసిన నిర్మాల్యగంధాన్ని తెలుసుకొనడానికి, నీ పాదతీర్థాన్ని, నీ నైవేద్యాన్ని

స్వీకరించడానికి, నీ జపం చేస్తూ నిన్ను వర్ణించడానికి దయతో జ్ఞానసంపదను అనుగ్రహించు.

**గ. ఇది శ్రీపరమేశ్వర కరుణాకలిత కవితావిచిత్ర కేసనమంత్రిపుత్ర**
**సహజపాండిత్య పోతనామాత్య ప్రణీతంబైన**
**నారాయణ శతకంబున**
**సర్వంబు సంపూర్ణము.**

లఘు టీకా : కలిత = పొందబడిన; ప్రణీతంబు + ఐన = రచింపబడిన.

భావం : ఇది శ్రీ పరమేశ్వరుని దయచేత పొందబడిన కవిత్వ వైచిత్రి
కలిగినవాడు, కేసనమంత్రి కుమారుడు, సహజ పాండిత్యం కలవాడు అయిన
పోతనామాత్యునిచే రచింపబడిన
నారాయణ శతకంలో
సర్వం సంపూర్ణం.

# భోగినీ దండకము

## శ్రీ సర్వజ్ఞ సింగరాజు వర్ణనము

శ్రీమన్మహామంగళాకారు, నాకారలక్ష్మీకుమారున్, గుమారీమనోరాము, రామాంబరీషాది రాజన్య రాజద్యశఃకాముఁ, గామాహితక్షీరవారాశి తారేశ వాగీంద్ర నాగేంద్ర మందార కుందార విందాభ్ర కల్లోలినీకాశ విఖ్యాత సత్కీర్తి ముక్తావళీ భూషితాశాంగనాలోక సీమంతు, సీమంతినీ మానసారామవాటీ వసంతున్, వసంతావనీనాథ సంసేవితాంచత్పదాంభోజు, నంభోజరాజీ సుహృత్తేజుఁ, దేజోజయప్రాభవోద్దాము, నుద్దామజన్యావనీ భీము, భీమప్రతాపానలాభీలజిహ్వాలి కీలావినిర్మూలితారాతి పాండ్యక్షమాపాల దుర్వార గర్వాటవీవారు, వారాధిపోరుప్రభా భాసుర స్ఫార కల్యాణ దుర్వారు, వారాశి వేలాపరీతావనీ భార ధౌరేయు, ధౌరేయతారాతిరాజన్మహాబాహు, బాహాకఠోరాసి ధారావినిర్భిన్న సోమాన్వయోత్పన్న భూభృత్సమూహున్, సమూహామహాశేముషీ కుంఠితాశేష శత్రుక్షమావల్లభున్, వల్లభా మానసేచ్ఛాకలాదుర్లభున్, దుర్లభారి క్షమానాథ మత్తేభయూధంబులం జించి చెండాడు రాసింగమున్ సింగభూపాలు,

## సింగభూపాలునిఁ గాంచి భోగిని మోహించుట

భూపాలగోపాలగోపాలికాకృష్ణగోపాలు గోపాలదేవోత్సవ క్రీడలో మేడలో నుండి జాలాంతరాళంబులన్ వారయోషాతనూజాత విద్యానయోపేత, సౌందర్య చాతుర్య విఖ్యాత, చంచద్గుణోపేత, భృంగాంగనాలబ్ధ కేళీ మహాహస్తకంజాత సంకాశ తూణీనిరుద్ధ ప్రసూనేషు నీకాశయై యుండి, దర్శించి, తద్వైభవంబుల్ విమర్శించి, సంతోష బాష్పంబు పూరంబు వర్షించి, హర్షించి, కందర్పబాణాహతిం జెంది, లోఁ గుంది, మోహించి, సంగంబు నూహించి “యే వేళఁ దల్లిన్ బ్రమోషింతు? నేలీల భూపాలకున్ జేరి భాషింతు? నేరీతిఁ గామానలంబున్ నివారింతు? నేనాతితోడన్ విచారింతు? నే వెంట రాచూలి వంచింతు? నేవంకఁ గోర్కుల్ ప్రశంసింతు? మున్నేఁ బ్రశస్తార విందంబునైనన్ మహీపాలు హస్తారవిందంబుపై నేఁడు లీలారవిందంబునై యుండుఁబో! రత్నహారంబునైనన్ శుభాకారు వక్షోవిహారంబుఁ గైకొందుఁబో! యేల యిట్లైతి? నెట్లో గదే!” యంచు శంకించుచున్ నిత్యకల్యాణు, లీలావతీ పంచబాణున్ మనోవీథి నంకించుచున్ ఘోషమాణాలికిన్, మందవాతూలికిన్, జంద్రమః కీలికిన్, గోకిలారావ దంభోళికిన్, జిత్తభూభల్లికిన్, దల్లికిన్ లోఁగి సంతాప ఘర్మాంబులన్ దోఁగి, కామానలజ్వాలలన్ వేఁగి, చింతా భరాక్రాంతయై క్రాఁగి, చింతించు నింతిన్ బరీక్షించి, బుద్ధిన్ విచక్షించి తన్మాత మాయాపరాభూత జామాత, మిథ్యానయోపేత విజ్ఞాత నానావశీకార మంత్రౌషధవ్రాత, లోకైక విఖ్యాత వారాంగనాధర్మ శిక్షాది సంభూత సమ్మోహితానేక

రాజన్య సంఘూత వాచాలతాబద్ధ నానామహోభూత యేతెంచి, కూఁతున్ బరీక్షించి, నీతిన్ విచారించి బాలన్, గళత్కుంతలవ్రాతఫాలన్, గరాంభోజరాజత్కపోలన్, సమందోష్ణ నిశ్వాస జాలన్, విపర్యస్త సన్యస్తచేలన్, మహాందోళన ప్రేంఖిత స్వర్ణడోలన్, మృగేంద్రావలగ్నన్, దయావృష్టిమగ్నన్, మనోజాగ్నిభగ్నన్, నిరంధన్, బరిస్రస్త ధమ్మిల్ల బంధన్, సముద్విగ్న మోహానుబంధన్, నిరాలాప నాలాపనస్వీకృతానేక కేయూరహారన్, గలద్బాష్పధారన్, బరిత్యక్తలాస్యన్, బరాభూత లీలావయస్యన్, బదాలేఖనాలక్షిత క్షోణిభాగన్, బరిక్షీణరాగన్ విలోకించి, బుద్ధిన్ విచారించి, లోనం బరాయత్తయై, చిత్తజాతాసిధారాచలచ్చిత్తయై, విన్నయై, ఖిన్నయై యున్న భావంబు భావించి, నెయ్యంబు గావించి, రావించి

## వేశ్యమాత కూఁతునకు బుద్ధులు చెప్పుట

“బాలా! జడత్వంబు మేలా? విచారింపనేలా? విలోకింపు బేలా! వయోరూపసౌందర్యముల్ రిత్తగాఁ జేయు నీవృత్తికిన్ మెత్తురే? వత్తురే కాముకుల్? చొత్తురే డాయఁ? గాయంబు విద్యున్నికాయోపమేయంబు హేయంబు ప్రాయంబు ధారాధరచ్ఛాయ మెన్నే నుపాయంబులన్ విత్తమాయత్తముం జేయ కీ రిత్తవాదంబు లాడంగ లాభంబె? లాభానకుం గారణంబైన నా మాట నేరంబె? నేరంబుగా దీ విచారంబు వంశానుచారంబు సంసారసారంబు లాభాధికారంబు చర్చింప నీబోఁటికిన్ బిట్టలంకారమే కాని ధిక్కారముం జేయరాదీ విచారంబు లేలే? శుభాకార! యేలే! గుణోదార! యేలే? శుభోదార! యేలే? తటిద్దేహ! యేలే? వరారోహ! యేలే? లలాటాలకవ్యూహ! యేలే? మహోత్సాహ! యేలే? విరాజన్ముఖాంభోజ! యేలే? మహోరోజ! యేలే? కలాలాప! యేలే? జగన్మోహన ద్రూప! యేలే? చలచ్చంచలాలోకన వ్రాత! యేలే? నయోపేత! యేలే? మహామర్మ భేదంబులై కౌముదీ మూలకందంబులై చూడనందంబులై సుప్రసాదంబులై మోహనశ్రీవిలాసంబులై యున్న నీ చారు హాసంబులన్, సోలి యోలిన్ భుజంగాలి జాలిన్ బడన్ దార్చుటో కాకలోలంబులై మోహ జాలంబులై చంచలాభంబులై మోహితాశేష లోకంబులై యొప్పు లీలావలోకంబులన్ బ్రౌఢలోకంబులన్ సద్వివేకంబులన్ బాపి తాపాతిరేకంబులన్ గూర్చుటో కాక తోరంబులై, మధ్య భారంబులై, నిర్జితానంగ సౌధోపరి స్వర్ణ కుంభంబులై యొప్పు నీ విప్పు వక్షోజకుంభంబులన్ జూపి పౌరావళిన్ నర్మలీలాకురంగావళిం జేసి నిర్జించి వర్జించుటో కాక రాజత్రిలోకీవశీకార మంత్రంబులై, యుల్లసత్కామ తంత్రంబులై, దర్పకోద్రేక యంత్రంబులై, మోహవారాశి భంగంబులై, సూచితానేక నర్మ ప్రసంగంబులై, కామకేళీ కలాపంబులై యొప్పు నీ భాసమానానులాపంబులన్ విత్తవల్లోక చిత్తంబులన్ రాగమత్తంబులం జేసి తత్తన్నిమిత్తంబులన్ నిత్యమున్ విత్త మెల్లం బ్రమోషించి దూషించి నిర్జించి తర్జించుటో కాక నీకీ కులాచారముల్ మాన

నేకీర సల్లాప బోధించెనో? నేఁడు నీతోడు నాతోడు మాటాడుమా! చూడుమా! కన్యకాలోకచింతామణీ! బంధుచింతామణీ! గోత్రరక్షామణీ! ధీమణీ! యెవ్వరెవ్వారి భూషించిరే? యేమి భాషించిరే? నేఁడు నీతోడఁ గ్రీడించు ప్రోడల్ కుమారీ! కుమారాన్నపోతావనీనాథ సూనున్, వధూచిత్తవిత్తాపహారావధానున్, సదా దానవిద్యానిరూఢున్, మనోజాతహృద్యానవద్యైక విద్యావలీఢున్, ప్రభాభానురాగానుసంధాను, మాయారమానాథు, సర్వజ్ఞసింగక్షమానాథు నే సన్నిధానంబునన్ జెప్పిరో? ఏమి వాతప్పిరో? యప్పరో! యప్పయోజాతగంధల్ సదాసత్యసంధల్ పురిన్ నీ వయస్యల్ మహాసౌమనస్యల్ సువర్ణా! సువర్ణంబు లార్జించుటల్ చూడవా? చూడ వాంఛింతురా రాజులన్? వారలా రాజులం గానరా? రాజుఁ గామింతురా? రాజబింబాననా! రాజరాజాధి రాజోన్నతిన్ రాజులన్ మించి రాజిల్లు నారాజు వంచింప నెంచంగ శోభిల్లునే చెల్లునే? భూమి నేజాతి యారీతి నీతిం బ్రకాశింప కీభంగి రాజిల్లునే? చెల్లఁబో! నీ పటుత్వంబు వాచాకటుత్వంబు బాలేందుశోభాలికా! బాలికా! బాలికల్ సేయు యత్నంబులే నీ ప్రయత్నంబు? లంభోజనాళాంతరాళ స్ఫురత్తంతుయోగంబునన్ జిక్కునే గంధనాగంబు? మిథ్యా మమత్వంబులన్ రంజకత్వంబులన్ గూఢయంత్రంబులన్ మోహమంత్రంబులన్ మారుతంత్రంబులం జిక్కఁడే చొక్కఁడే దిక్కులన్ జిక్కులం బెట్టు మేధన్ మహావేధనైనన్ విరోధించి వాకట్టు నీతిన్ బలారాతి మంత్రిన్ బ్రమోషించు భాషావిశేషంబులన్ శేషుతోనైన భాషించు మాయావిధానంబులన్ మాధవున్ మెచ్చఁడచ్చోట నెచ్చోట మెప్పించెదే! చీటికిన్ మాటికిన్ బోటి! యామేటి యిచ్చోటికిన్ రాఁడు పాటించి నీపాటి పాలీననేత్రల్ ధరిత్రీశు చిత్తంబు మత్తంబుగాఁ జేయఁగాఁ జాలరే? యేల రేలుంబగళ్ళున్ విచారింపఁ? జాలింపవే! వారవేశ్యాభుజంగుండు గాఁడే మహారాజవేశ్యా భుజంగుండు నిన్నేల యేలున్? బరస్త్రీలకున్ వేళ యీఁ డెన్నఁడున్ దత్తుఁ బాంచాలు భద్రున్ మరున్ గూచిమారున్ వినంగోర కేరీతి నేనాతిచే వింటి వేమంట నీవంటి దీవెంటలన్ దంటయై గెంటిపోఁ జూచునే? తమ్మికంటీ! నినుంగంటి నీవెంటకాహా! కనుంగంటి నీగొంటు చైదంబు దైవంబు క్రేఁగంటి కేనెంత కంటైతినో! జంట నింటింటికిన్ వెంటవెంటం బడన్ బంటనే? తాళనంటిన్ జిరంటీ! చెనంటీ! గుణం బేటికే? మాయలాఁడీ! విభుండైనఁ బోఁడే! నిమగ్నుండు గాఁడే! మముం జేరనీఁడే! నినుంజేరరాఁడే! ప్రవేశింప రాదే! ప్రమోషింప వాదే! ప్రవర్తింపఁ గాదే! ప్రవర్తింతువెచ్చోట నచ్చోటి కేమేఁ బ్రియంబాడ రామే! నినుం బాయలేమే! మహోపాయవై కన్యకా! ధన్యు నన్యున్ మదిం గోరుమా! చేరుమా చేరు మా కిష్టముల్ వీట లేరే మగల్? చేర రారే నినుం గోరి తారే విహారేహులై గేహళీ వాటికిన్ మాటికిన్? వచ్చు నేవారి నీవారిగాఁ జూడవున్ గూడవున్ వారిజామోద! యీ వారరామల్ మనోరాములన్ రిత్తపోరాములన్ గాని

నిక్కంపుఁ బోరాములం జేసి గారాములం జిక్కిరే? సొక్కిరే? వారు వారాది కృత్యంబులం జేయు వార క్రియల్ చెల్లవే తల్లి! రాజుల్ బహువ్యాజులే భోజులే? చంచలచ్చిత్తులే! మత్తులే! వ్రేతఁ కాయత్తులే! నూతనాసక్తులే! లోభ సంయుక్తులే! దోషసంసక్తులే! రంధ్రసంపాదులే! వీత మర్యాదులే! వారి సేవింప భేదింప జీవింపఁ బోరామిఁ గావింపఁగా రాదులే! కాదులే వాదులేలా? నవైలాలతా దేహ! సందేహమే దేహమేలే యలంపన్? నిలింపాంగ నాభా! సునాభా! మదిన్ మానవే మానవేశాభిలాషంబు లేమా! భరింపంగ లేమా? కరంగింప లే మానరేశున్ జితశ్రీసురేశున్ గతస్త్రీజితోద్దండ వేదండ చండాహితా ఖర్వగర్వాంధ వేదండ గండస్థలీఖండితారాతిదండంబు గండంబుగా నుండు నమ్మండలేశున్ విరాజన్ముఖాంభోజు నాభోగినీ రాజుతో నోజతో నీకుఁ బొత్తుండఁగాఁ బోలునే? నీకు మాదండ నేదండమున్ జెందదే చెల్లునే? రాజదండంబు గండంబు గండంపుటండంబుగా నిక్షుకోదండ విభ్రాజిత భ్రూయుగా! భూమిపాలావరోధంబు లేలా? విరోధంబు నీకున్ మహాభద్రమా? భద్రమాతంగకుంభస్తనీ! కన్న వారంబు గామా? హితాదేశముల్ సేయఁగా మాకు ధర్మంబు కామాశుగా లోకనా! యేల కామాతురత్వంబునుం జెంద? రామా! త్రిలోకాభిరామా! వరాలేపహేమాదులున్ నీకు నీమా? కులోత్తంస! యే మాకులత్వంబునుం బొంద మామాట లేపాటివే? మాటు లాలించు వారిన్ నిరీక్షింప కీ మానవాధీశుపై మానసం బేల పట్టించెదే? ముద్దుపట్టీ! భవచ్చాతురిం బట్టి సర్వజ్ఞసింగ క్షమానాథుఁ దప్పించి దర్పించి లోకత్రయిన్ నీకు నర్పింతునే మారునిన్ జారునిన్ జేసి రప్పింతునే బ్రాఁతియే పైఁడి? నా పైఁడి! యే పైఁడి లేదింటిలో? వింటివా? రాచపోరామి యిట్టట్టుఁ బోరామికిన్ మూలమే! మేలమే? యింత రవ్వేలనే? యిందు నవ్వార విందాననా! ముందు విందానవే! లాట కర్ణాట పాంచాల నేపాళ బంగాళ చోళాది రాజన్యకన్యల్ వయోరూప ధన్యల్ సదాసక్తలై డాసి యున్నారఁటే! రారఁటే పాసి తత్పాద రాజీవ సందర్శనారంభ సంరంభులై వీతహృద్దంభులై కుంభినీశుల్ బహూపాయన ద్రవ్యహస్తుల్ సురూప ప్రశస్తుల్ మహాసక్తి నక్తందినంబుల్ ప్రవేశించి యున్నారు కన్నారు విన్నారు లోకుల్ వరాలోక! నీకేల లీలావకాశంబు సిద్ధించు? సిద్ధించెనా మన్మథాకారుతోఁ గూడి క్రీడింపఁగాఁ బోలదే పోలినన్ వాని వాణిన్ మహావాణి కాఁపున్నదే! మన్నదే రత్న గర్భంబుతో భూమి తద్బాహుపీఠిన్ దిశా కుంభికుంభీనసాగేంద్ర కూర్మాదులన్ బాసి కూర్మిన్ విలోకంబులన్ లచ్చి వర్తించునే దిక్కులందెల్ల కీర్తుల్ ప్రవర్తించునే దుర్లభుండే బహుప్రేయసి వల్లభుండే! సదైకానుషంగంబు భంగంబు పణ్యాంగనాజాతికిన్ ఖ్యాతికిన్ నీతికిన్ దప్పితే? చెప్పితిం గూన! సిద్ధంబు తద్ధాత మున్ వారభామా తనూజాతకున్ గూఁతుగా మాతనూజాతఁ గావించె నిర్ణీతమే యేతదర్థంబు మర్యాద నిమ్మేదినిన్ వారమే

నాదినుండిం బ్రయోగింతునే దాదినై కామశాస్త్రాదివిద్యాసమేతన్ భవన్మాత నుద్దామ మాయా ప్రభూతన్ గురంగీవిలోకా! నిరంగీకృతా కారతల్ మాని నామాట నీమాటు పాటింపవే నందినీ! నిందనీయంబు గాదే మహానందనీయంబు చిత్తంబుతో నుండు నీవే జనానందనీయా! కఠోరాచలోద్దండకాఠిన్యమున్ డింప రత్నాకరశేణి లోఁతున్ నివేదింప విత్తేశు గేహంబులున్ రిత్తసేయన్ జగచ్చక్షువున్ గన్ను మూయన్ సదాగామి నాఁకట్ట నుద్యద్భుజంగావళిం బట్ట వారాంగనాజాతికిన్ న్యాయమే? మామకన్యాయ సంపన్నవై పన్ని యొకన్య నీవన్యులన్ బౌరసంపన్నులన్ భిన్నులన్ ఖిన్నులన్ జేసి మన్మందిరాళిందభూమండలాసన్నులం జేయుమీ! రాచబిడ్డేటికే? బిడ్డ! వాచాటతల్ సాఁగవే సాఁగినన్ నీకు జూదంబులా? కాక వీణావినోదంబులా? గద్యపద్యాదివాదంబులా? మాళవీముఖ్య రాగానుగానంబులా? దండలాస్యాది నృత్యావధానంబులా? యింద్రజాలాది మాయావిధానంబులా? వశ్యమంత్ర ప్రయోగోపసంహార విద్యావిచార ప్రభావంబులా? రామ! యారామవాటీలతాజాలమూలాభిషేక ప్రచారంబులా? హేమడోలావరోహంబులా? కాక కేళీసరోవ్యూహవీచీ సమూహావగాహంబులా? బంధుగేహ ప్రవేశంబులా? రాజ హంసావళీమందయానోపదేశంబులా? నీలకంఠావళీనృత్య శిక్షావిశేషంబులా? కాముకవ్రాతచిత్త ప్రమోదంబులా? బొమ్మరిండ్లాటలా? యాటలా? పాటలా? పాటలామోద! రాజోపకంఠాటనంబుల్ కఠోరాసిధారా వలేహంబులే! సింహ యోగంబులే! సర్పవల్మీకభోగంబులే! శైలశృంగాగ్రవీథీ విహారావధానంబులే! తుంగ తాళాగ్రకోటీ తపస్సంవిధానంబులే! మత్తశార్దూలకుంజప్రవేశంబులే! గంధశుండాలశుండా వినోదంబులే! సప్రమాదంబులే! కొమ్మ! మా కొమ్మ కేరాజు సఖ్యం బసౌఖ్యంబు మేమొల్లమే మొల్లముల్ మాకు లాభంబులే? డించ కేవేళ నెమ్మోము సొంపారు? నేవేళఁ బాలిండ్లు పెంపారు? నేవేళ ఫాలంబునన్ గుంతలశ్రేణు లల్లాడు? నేవేళ మైదీఁగెయున్ వీడు? నేవేళ నాయాసముల్ తీఱు? నంచుం బ్రతీక్షింప నీవింతవై వంత లెన్నేనిఁ గల్పించెదే? యింత నీవంతయై నేఁడు నాసింగభూపాలు పాలై ప్రవర్తించుచోఁ గంబుకంఠీ! భవద్దర్శనోత్కంఠతన్ రాజ గేహోపకంఠంబులన్ వచ్చు నీవారి వారింతురే వారి దౌవారికుల్ వారధర్మంబువా రంచు దుర్వారులై తన్మహాగేహ నిర్యూహసేవారతాయాత భూపాలక వ్రాతవేదండగండస్థలీ నిస్సరద్దానధారావళీ జాతజంబాలసంఘంబు దుర్లంఘనీయంబు మాకున్ మహాదుర్గమంబే చొరన్ నిర్గమింపన్ మహోత్సాహవై వత్స! మత్సాహచర్యంబుఁ గైకొమ్ము!" రమ్మంచు లెమ్మంచు బోధించు తల్లిన్ ధనాదానవిద్యామతల్లిన్ విటస్వాంత భల్లిన్ నిరూపించి కోపించి బుద్ధిన్ బ్రబోధించి

## భోగిని విరహముచేఁ దల్లిపైఁ గోపించుట

"యమ్మా! వినం జూడ నేనొల్లఁ బొమ్మా! విచారించుకొమ్మా! భవన్నీతి దుర్నీతి సన్మానుషం బింతయున్ లేని దుర్మానవశ్రేణి నీవేల? యీవేళ భూషించెదే! యేల భాషించెదే? యేల నన్నుం బ్రమోషించెదే? రాయచౌహత్త మల్లున్ వధూటీసరోజాతభల్లున్ మహారాజవేశ్యాభుజంగన్ హయానేకప గ్రామహేమాది నానామహాదానచంగున్ వధూలోకపాంచాలు సర్వజ్ఞసింగావనీనాథు గైకొంట తప్పే? కకుప్పాలసంకాశుఁడే! వాని యొప్పుల్ సతుల్ చెప్పరే? యేల నొప్పింప? మాతల్ తనూజాతలన్ జాతవిత్తాశలన్ బేశలత్వంబు లే కర్మిలిం బాసి నారోటు? రారోటు రక్షారతిన్? గోర్కు లేరోటు! నీవింత నెగ్గింప నెగ్గేమి గావించితిన్? లోకనిర్మాత నిర్మాతగాఁ జేయ కేలా సదుర్మాతఁ గావించె? విజ్ఞాతయోషామనోవృత్తసంఘాతవున్ మాతవున్ గామసిద్ధాంతవిఖ్యాతవున్ జూడ నేతద్దురాలాపముల్ చిత్తసంతాపముల్గాఁ బ్రయోగింతురే? కూఁతుఁ జింతానదిన్ ముంతురే? పిన్న నాఁడెల్ల నాఁడెవ్వరిం గోరవే? మున్ను రంభోర్వశీమేనకాదుల్ సుకందర్ప సిద్ధాంతవేదుల్ వశీకార విద్యా ధురీణల్ ప్రవీణల్ వరశ్రేణి నూహింపరే? చూచి మోహింపరే? వారలూహింపరే నీతులన్? నిర్దయాలాపవై పాపవై పాపవేలా మనోజవ్యథన్? నిన్ను నేమందు నేమందులన్ మానదే మానసత్త్వంబు చింతింపు మవ్వా! విభుండేమిదవ్వా? యెఱింగించి రప్పించెదో? కాక కామానలజ్వాలకున్ నన్ను నొప్పించెదో? యింత ఆంతేల నీకున్? గొఱంతేల సద్ద్రవ్యముల్ తల్లి! నేనెల్ల వేళన్ మనోజాగ్నిలోఁ గంది లోఁ గుందఁగా ఘ్రంద నీమందటల్ చాలు ముందేటికిన్ గంటివే? కెంటసం బేల? ఘంటాభవై మ్రోసెదే? యన్యకున్ గన్య గానైతి నుద్దామశృంగారుపై దీనమందారుపై భూమిభృద్గాయగోవాళుపై రాయశుండాలహర్యక్షుపై రాయ కందర్పఫాలాక్షుపై రాయగోపాంగనా బృందగోవిందుపై సంతతానందుపైఁ బోచమాంబా లసద్గర్భసంజాతుపై లోకవిఖ్యాతుపైఁ బాదపీఠాంకితారాతి భూపావళీపాలుపై సింగభూపాలుపై వ్రాలి నా చిత్తమున్ మత్తమై సోలి కామానలాయత్తమై రాదు తేరాదు నే నా మరుండైన గౌరీవరుండైన వాణీధరుండైన దేవోత్తరుండైన నన్యున్ మదిన్ గోరఁగా నొల్లనే యుల్లసత్ఫుల్ల మందార రాజన్మరందంబు నందంబునన్ గ్రోలు మత్తాళి దుత్తూరమున్ గోరునే? హేమరాజీవ రాజీరజోరాజితాకాశగంగానదీ లోలకల్లోలడోలానటద్రాజహంసంబు శైవాలగండూపదీభేక భేకీఢులీసంకులాసారకాసారమున్ జేరునే? మండితాఖండలానీత జీమూత నిర్యత్పయోధారలన్ ద్రావు సారంగి కుంభాంతరాంభః ప్రపూరంబులన్ ద్రావునే? మాధవోజ్జాతచూతాంకుర స్వాదులీలాలసత్కోకిలేంద్రంబు ఝిల్లీవర క్రూరభల్లాతకీ శాఖకున్ బోవునే? సింగభూపాల బాహాపరీరంభసంరంభసంభోగమున్ గోరు

యోషా శిరోరత్న మాశించునే, నీచసంభోగ మంబా? కుతర్కావలంబా! చలంబా! విలంబానులాపంబులన్ బాల సూర్యాభునిన్ బాయ నాడన్ బురోభాగినీ! భోగినీ రాజు కంటెన్ మహాభాగు నాభాగసౌభాగ్యశోభాగరిష్ఠున్ బ్రవేశించి నృత్యావధానంబులన్ మంజుగానంబులన్ జిత్తమార్జింతునే విత్తమున్నే నివర్జింతునే యెట్టిదిన్ విత్తమేరిత్తమై యేటికే? నిత్యదంభా! దురాలాపయుక్తిన్ బ్రలోభింప విద్వేషినే? యేలనే? గోలనే? బాలనే? నేరనే! మానలేనే వరాధీశచూడామణిన్ వారకన్యాజన గ్రామణీ! పాపజాతీ! భవజ్జాతి దుర్జాతి పొమ్మంచు లెమ్మంచు నోచెల్ల! రేచెర్లగోత్రోద్భవున్ మానలేనంచు మాయొన్నతా! యన్యులన్ జేరలే" నంచు హృద్భల్లితో వక్రవాగ్భల్లితోఁ దల్లితో మాటఁ జాలించి ధైర్యంబుఁ

## వారకన్య సోదరిని దన వెత దీర్ప వేఁడుట

గీలించి శాతోదరిన్ సోదరిన్ జూచి "యక్కా! ప్రసూనాస్త్ర ధిక్కారమున్ జూచితే? నేఁడు రాకేందురాకన్ దురాకంపమున్ బొందె డెందంబు చైతన్యసంచాలియై కీలియై గాలి యేతెంచెఁ గోదండియై దండియై తూణియై బాణియై కంపిత ప్రాణియై కాముకారాతి యేతెంచె వాసంత వేళారమాకందమాకందశాఖావళిన్ గోకిలారావ కోలాహలంబుల్ విటస్వాంత హాలాహలంబుల్ దిశల్ మించి యేతెంచెనే! సింగభూమీశుతో భోగదేవేశుతోడన్ నివేదింపవే! కాము సంతాపమున్ డింపవే! డింపి పుణ్యంబునం బోఁగదే! రాఁగదే! వేగఁదే!" యంచుఁ జింతించు నాత్మానుజాతన్ గృశీభూతఁ గన్గొంచు

## వారకన్య సోదరి దాని వలపును సింగరాజునకుఁ దెలిపి కావ వేఁడుట

"బాలా! లలాటాక్షు దర్శించుమీ! శేషభోగిన్ బ్రకర్షింపుమీ! రాహు భావింపుమీ! చంపకశ్రేణి వర్జింపుమీ!" యంచు భీతిన్ నివారించి నీతిన్ విచారించి యారామసౌధాంతరాళస్థలిన్ నర్తనాగారవేదిన్ మహారాజభోజున్ మణిస్వర్ణపర్యంకికా భాసమానున్ మనోభూసమానున్ ఘనున్ రావుసింగక్షమానాథ పౌత్రున్ సమీచీన రేచెర్ల గోత్రాంబుజాత్మమిత్రున్ మహోదారచారిత్రు సర్వసింగోర్వరాధ్యక్షు నీక్షించి దండ ప్రణామంబు సాపేక్షఁ గావించి హస్తాబ్జముల్ మోడ్చి "దేవా! భవన్న్యస్త సౌజన్యధన్యన్ జగన్మాన్యఁ గన్యన్ నిరన్యాంక పీఠాధిరోహన్ నిరన్యోపగూహన్ నిరన్యాభిలాషన్ నిరన్యాభిభాషన్ నిరన్యావకాశన్ నిరన్యప్రకాశం బ్రసూలోచన క్షిప్త బాష్పాంబుపూరన్ మనోజాత బాణావళీశంకిత ప్రాణభారన్ సఖీమానస న్యస్తచింతాసమూహన్ భగిన్యంక సంప్రాపితానేక దేహన్ భవద్వైభవాకృష్టచిత్తన్ బరాయత్తవృత్తిన్ గృపం జూడు" మంచున్ బ్రశంసింప

## సింగరాజు వారకన్యను జేపట్టి భోగినిఁగాఁ జేయుట

నా భోగదేవేంద్రుఁ డా సత్యభాషాహరిశ్చంద్రుఁ డా కామినీలోకపాంచాలుఁ డా సింహభూపాలుఁ డాబాల నా బాలశీతాంశుఫాలన్ సరోజాతహస్తన్ గుణైకప్రశస్తన్ శుకాలాపవాణిన్ లసన్నీలవేణిన్ మృగేంద్రాపలగ్నన్ మనోజాగ్నిమగ్నన్ దయాదృష్టి రావించి భావించి నెయ్యంబుఁ గావించి బాహాపరీరంభ సంరంభ నిర్ముక్తసంతాపఁ గావించి కందర్ప కేళిన్ వినోదించి సద్భోగినీపట్టమున్ దిట్టమౌ నట్టుగా వే ప్రసాదించి తన్మాత రావించి యుద్యద్గజారూఢఁ గావించి విఖ్యాతి వ్రోయించి యిష్టంబు గావించి యొప్పించె నీ భోగినీ దండకం బిద్ధరామండలంబందుఁ జెల్వొంది యాచంద్రతారార్కమై యొప్పుచుండున్.

ఉ. పండితకీర్తనీయుఁడగు బమ్మెర పోతన యాసుధాంశు మా
ర్తాండ కులాచలాంబునిధి తారకమై విలసిల్ల భోగినీ
దండకమున్ రచించె బహుదాన విహర్తకు రావుసింగ భూ
మండల భర్తకున్ విమత మానవనాథ మదాపహర్తకున్.

**శ్రీకృష్ణార్పణమస్తు**

**భోగనీ దండకము సంపూర్ణము**



బమ్మెర పోతనామాత్య కృత

# నారాయణ శతకము

## భోగనీ దండకము

జాతీయ కవి  బమ్మెర పోతన గంటం తాళపత్రాల క్షేత్రంలో పండించిన ముత్యాలపంట తెలుగు భాగవతము.  వారిదే ఈ నారాయణశతకం. మోక్షాన్ని అందించే నారాయణ నామం మకుటంగా కల ముత్యాలహారమిది.  ఇది జ్ఞాన మార్గ ఔత్సాహికులకు చక్కటి ఔషదం.

ఇట్టి నారాయణ శతకాన్ని పోతన తెలుగు భాగవతాన్ని అంతర్జాలంలో తెలుగువారికి చేర్చే 'తెలుగుభాగవతం.ఆర్గ్' (telugubhagavatam.org) వెబ్‌సైటులో కంది శంకరయ్య గారి భావార్థ సహితంగా అందించాము.

దీనిని  పుస్తకరూపంలో  అందించమన్న పాఠకుల కోరిక  మేరకు ఇప్పుడు ముద్రిస్తున్నాము.

లౌకిక ప్రయోజనాల కొరకు మొదట 'భోగినీ దండకం' వ్రాసి పశ్చాత్తాపం చెంది ఆధ్యాత్మిక రచనలు చేసినవాడు పోతన.  ఆయనకు దిశానిర్దేశం చేసిన రచనగా  భోగినీ  దండకాన్ని  చెప్పవచ్చు. శబ్దాలంకారాలతో  మనోహరమైన ఆ  దండకాన్ని  పాఠకులకు  అందించాలనే  సంకల్పంతో  దానిని  కూడ ఈ ముద్రణలో చేర్చడం జరిగింది.

భాగవత గణనాధ్యాయి

**ఊలపల్లి సాంబశివ రావు**